# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 247 | హైదరాబాద్ | గురువారం 26-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00



ఇరాన్‌తో యుద్ధానికి తెరపడే సమయం..
15 సూత్రాల శాంతి ప్రణాళికను
పంపిన అమెరికా

11లో



11లో

రాజకీయాలను పక్కనపెట్టి..
**భట్టి విక్రమార్కతో**

## కేటీఆర్ భేటీ

- సిరిసిల్ల నేతన్నల కోసం మల్లును కలిసిన కేటీఆర్
- రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలని విన్నపం
- పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలన్న కేటీఆర్
- సానుకూలంగా స్పందించిన మల్లు భట్టి విక్రమార్క

## హైదరాబాద్‌లో వడగళ్ల వాన

రంగారెడ్డి జిల్లాకు రెడ్ అలర్ట్



11లో

- వనస్థలిపురం, హయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన
- హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లిలో భారీ వర్షం

జర్నలిస్టుల 'మహా' గర్జన

## పాలకుల వివక్షపై
# కదంతొక్కిన కలం యోధులు!

- ఐఅండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడితో దద్దరిల్లిన మాసబ్ ట్యాంక్
- బడ్జెట్‌లో మొండిచేయి.. అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులపై సర్కార్ నిర్లక్ష్యం
- 'ఛలో హైదరాబాద్' సక్సెస్.. సమస్యలు తీరకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

12లో






11లో

ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీలు
## వసూలు చేయొద్దు

- హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక
- ఎల్పీజీ గ్యాస్ కొరతపేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయన్న సీసీపీఏ
- హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు వచ్చినట్లు వెల్లడి
- అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్న కేంద్రం

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం..
### 3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్



11లో



11లో

అనుమతిలేదంటూ హర్మూజ్ దాటిన పాకిస్థాన్ నౌకను
## వెనక్కి రప్పించిన ఇరాన్

- యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి ఇరాన్ నిబంధనలు
- షార్జా నుంచి కరాచీకి వెళుతున్న పాకిస్థాన్ కంటైనర్ నౌక
- అనుమతి లేదంటూ నౌకను నిలిపివేసిన ఇరాన్
- ధృవీకరించిన కాబుల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం



ట్రంప్ బృందాన్ని కాదని..
## జేడీ వాన్స్‌తో చర్చలకు ఇరాన్ మొగ్గు!

- అమెరికాతో చర్చలకు ఇరాన్ కొత్త ప్రతిపాదన
- ట్రంప్ అల్లుడు కుష్నర్‌పై అపనమ్మకమే ప్రధాన కారణం
- జేడీ వాన్స్ విదేశాంగ విధానంపై ఇరాన్‌కు సానుకూలత

11లో



ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో
## ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- తెలుగు రుచులను ప్రపంచానికి పరిచయం చేయడంలో వర్సిటీ సహకారం
- ఏపీని కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి దోహదపడనున్న ఎంఓయూ

11లో

## 'వందేమాతరం' పాడటం.. తప్పనిసరి కాదు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



11లో



10లో

లేఅవుట్ మింగేసి..
## పాస్‌బుక్ కొట్టేసి!

- పాటిఘనాపూర్‌లో రియల్ మాఫియా మాయాజాలం
- 92 ఎకరాల ఆనందనగర్ లేఅవుట్ కబ్జా.. రోడ్లు, పార్కులూ ఖతం
- క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సీరియస్.. రీసర్వేకు ఆర్డర్

# బెంగాల్ గేమ్ ఛేంజర్ అవుతుందా

2021 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రభావం ఇప్పటికీ ఆ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై గట్టిగానే కనిపిస్తోంది. అయితే అది కేవలం గతం జ్ఞాపకంగా నిలిచిపోలేదు; 2026 ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అది మారుతూ, మరింత స్పష్టమైన సూచనగా కనిపిస్తోంది. ఒకప్పుడు అనేక పార్టీల మధ్య జరిగిన పోటీ, గత దశాబ్దంలో క్రమంగా కుదించుకుపోయి, ఇప్పుడు ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), భారతీయ జనతా పార్టీ (బిజెపి) మధ్య ద్వైపాక్షిక పోరాటంగా మారింది. ఇదే సమయంలో వామపక్షాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, వాటి విజయాలు పరిమితంగానే ఉన్నాయి. ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఎవరు ముందుంటారు అనేది మాత్రమే కాదు; 2021లో ఏర్పడిన రాజకీయ సమతుల్యత స్థిరమా లేక సున్నితమైనదా అనేదే కీలకం. 2021 ఎన్నికల ఫలితం చూస్తే అది స్పష్టమైన విజయం. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి మూడింట రెండు వంతుకుపైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని, దాదాపు సగం ఓట్లను సంపాదించింది. అయితే ఆ విజయంలో ఒక ముఖ్యమైన మార్పు కూడా దాగి ఉంది. బిజెపి అట్టడుగు స్థాయినుంచి ఎదిగి, ఒక బలమైన ప్రతిపక్షంగా మారింది. దాదాపు ఐదో వంతులో రెండో వంతు ఓట్లను సంపాదించి, వామపక్ష, కాంగ్రెస్ కూటమిని పక్కకు నెట్టింది. ఈ మార్పు ప్రాధాన్యం చాలా గొప్పది. ఎన్నాళ్ళుగా సిద్ధాంతపరమైన పోటీలు, వర్గాల పొత్తు రాజకీయాలతో సాగిన బెంగాల్ రాజకీయాలు, ఇప్పుడు రెండు వేర్వేరు రాజకీయ విధానాలను ప్రతిబింబించే పార్టీల మధ్య నేరుగా, స్పష్టమైన పోటీగా మారాయి. ఒకటి ప్రాంతీయ ఆధిపత్యం, సంక్షేమ కార్యక్రమాలపై ఆధారపడితే, మరొకటి జాతీయ ఏకీకరణ, గుర్తింపు రాజకీయాలపై దృష్టి పెట్టింది. ఐదేళ్లు గడిచిన తర్వాత కూడా, టిఎంసి ఆధిపత్యం ఎంతకాలం నిలబడుతుందన్నది. 'కొనసాగింపు, అలసట' అనే రెండు అంశాల మధ్య జరుగుతున్న సంక్లిష్ట సమతుల్యతపై ఆధారపడి ఉంది. పార్టీకి ఉన్న ప్రధాన బలం దాని బలమైన సంస్థాగత వ్యవస్థ, అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఓటర్ల విశ్వాసాన్ని సంపాదించే సామర్థ్యం. మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలను లక్ష్యంగా పెట్టుకున్న పథకాలు, స్థిరమైన సామాజిక మద్దతును ఏర్పరచాయి. ఇప్పటివరకు ఈ మద్దతు, ప్రభుత్వ వ్యతిరేక భావన, తీవ్రమైన రాజకీయ ప్రచారాలను కూడా తట్టుకుని నిలిచింది. అంతేకాదు, మమతా బెనర్జీ వ్యక్తిగత ప్రజాదరణ కూడా పార్టీకి కీలక బలం. ఆమె నాయకత్వం పార్టీ కథనాన్ని బలపరచడమే కాకుండా, అంతర్గత విభజనలను తగ్గించడంలో సహాయపడుతోంది. అయితే, అధికారంలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది. అవినీతి ఆరోపణలు, పార్టీలో వర్గపోరాటాలు, స్థానిక స్థాయిలో కార్యకర్తలలో ఉన్న అసహనం-- ఇవన్నీ కొన్ని ప్రాంతాల్లో వ్యతిరేక భావనకు దారితీశాయి. ఇవి తాత్కాలిక సమస్యలుగా కొట్టిపారేయలేనివి. ఈ బలహీనతలను టిఎంసి నాయకత్వం గుర్తించినట్లే కనిపిస్తోంది. అందుకే అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేయడం, కొత్త తరాన్ని ముందుకు తీసుకురావడం వంటి చర్యలను చేపడుతోంది. అయితే ఇవి ఎంతవరకు ప్రభుత్వ వ్యతిరేక భావనను తగ్గిస్తాయన్నది కీలక అంశంగా మారనుంది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో పార్టీ ప్రదర్శన, దాని స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, అత్యంత కీలకమైన అసెంబ్లీ పోటీలో పార్టీ పట్టు కోల్పోయే అవకాశాన్ని ఇవి పూర్తి తొలగించలేవు. బెంగాల్‌లో పార్టీ విస్తరణ ఇప్పటికే రాష్ట్ర రాజకీయ సమీకరణలను మార్చేసింది. అయితే 2021 తర్వాత దాని ప్రస్థానం, పురోగతి కంటే ఎక్కువగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికే పరిమితమైంది. ఉత్తర బెంగాల్ ప్రాంతాల్లో, అలాగే గుర్తింపు రాజకీయాలు, పాలనపై పార్టీ ఇచ్చిన సందేశాలకు స్పందించిన వర్గాల్లో బిజెపికి గట్టి ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ, ఓట్ల వాటాకు, సీట్ల మార్పిడికి మధ్య ఉన్న అంతరం ఒక కీలకమైన అడ్డంకిగా మిగిలిపోయింది. 'ఫస్ట్ -పాస్ట్ -ది- పోస్ట్' విధానం సంస్థాగత బలహీనతలను మరింత స్పష్టంగా బయటపెడుతోంది. ఈ విషయంలో బిజెపి, టిఎంసిలో పాతుకుపోయిన క్షేత్రస్థాయి యంత్రాంగం కంటే వెనుకబడి ఉంది. బిజెపి ఎదుగుదలకు మరో ముఖ్యమైన అడ్డంకి నాయకత్వ సమస్య. జాతీయ స్థాయి నాయకులు పార్టీకి గుర్తింపు, ఉత్సాహం తీసుకువచ్చినా, మమతా బెనర్జీకి సమానంగా రాష్ట్రస్థాయిలో ప్రభావం చూపగల నాయకుడు లేకపోవడం పార్టీకి పెద్దలోటుగా మారింది. బెంగాల్ రాజకీయాల్లో ఎప్పటినుంచో ప్రాంతీయ భావజాలం, వ్యక్తిగత నాయకత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అయితే బిజెపి ప్రధానంగా కేంద్రస్థాయి కథనాలపై ఆధారపడటం వల్ల, అవి స్థానిక స్థాయిలో పూర్తిగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ లోటును పూడ్చాలంటే, పార్టీకి కేవలం ఓట్ల శాతం పెరగడమే కాకుండా, మరింత సమర్థవంతమైన సంస్థాగత నిర్మాణం, స్పష్టమైన రాష్ట్రస్థాయి నాయకత్వ వ్యూహం అవసరం. ఇక వామపక్షాల పరిస్థితి చూస్తే, అది చారిత్రక పతనాన్నీ, తాత్కాలిక పట్టుదలనూ ప్రతిబింబిస్తోంది. మూడు దశాబ్దాలపాటు ఏకపక్ష ఆధిపత్యం చూపిన వామపక్షాలు, ఇప్పుడు శాసనసభలో దాదాపు కనిపించని స్థితికి చేరాయి. 2021లో వారి సంప్రదాయ మద్దతుదారులు బిజెపి వైపు మళ్లడం, బిజెపి సిద్ధాంతానికి మద్దతు పలకడం కంటే, టిఎంసిని ఓడించాలనే వ్యూహాత్మక నిర్ణయాన్ని ఎక్కువగా భావించాలి. అయితే ఈ విధమైన వ్యూహాత్మక ఓటింగ్ వల్ల ప్రస్తుతం రాజకీయాలు రెండు పార్టీల మధ్యే కేంద్రీకృతమయ్యే పరిస్థితి మరింత బలపడింది. ఇదే పరిస్థితి వామపక్షాల పునరుద్ధరణకు అడ్డంకిగా మారుతోంది. అయినప్పటికీ, వామపక్షాల ఉనికి కొంతమేర మిగిలి ఉంది అనేందుకు ఆధారాలు ఉన్నాయి. ముఖ్యంగా యువతలో, అలాగే పట్టణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో కొంత మద్దతు కనిపిస్తోంది.

# ఏపీలో మహిళా నియోజవర్గాలు..ఇవే

తిరుపతి,మార్చి 25,

దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్ విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గం లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్,కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్,విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్,గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్చాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ,ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల,వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి,పోలవరం, కావలి,జమ్మలమడుగు,కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు,ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు,ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె,తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం.పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల,విజయవాడ, కర్నూలు,కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి,ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. మరి ఈ నియోజకవర్గాల్లో మహిళలకు ఛాన్స్ దక్కుతుందా? లేదా? అన్నది చూడాలి.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్

విజయవాడ, మార్చి 25,

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం



ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరఫున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్‌కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.జగన్ రాజకీయ జీవితం మొత్తం "మాట తప్పను.. మడమ తిప్పను" అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పందాలను ధిక్కరించడం వల్ల ఆయన 'విశ్వసనీయత' ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను గణనీయంగా దెబ్బతీస్తోంది.ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో 'అక్కా.. చెల్లెమ్మ' అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయి. "సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?" అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ 'మొండితనం'గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన 'ఈగో' వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

# జనసేనలో వారసుల తంటా

కాకినాడ, మార్చి 25,

జనసేన పార్టీ ప్రారంభం నుంచే కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించకూడదనే ఆలోచన పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఆ సమయంలో పార్టీకి పెద్దగా ప్రభావం కనిపించలేదు. అయితే 2024 ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పార్టీకి ప్రజల్లో డిమాండ్ పెరిగింది, నాయకులు కూడా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ మార్పు వల్లే జనసేన రాజకీయంగా బలపడినట్టు కనిపిస్తోంది.దీంతో జగ్గంపేట వంటి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా జరిగింది. పార్టీ బలపడటంతో నాయకులు కూడా తమ స్థానం కోసం ప్రయత్నాలు పెంచారు. అయితే ఇప్పుడు మరో ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి



ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగా పెద్దగా మాట్లాడకపోయినా, నియోజకవర్గ స్థాయిలో తమ వారిని ప్రోత్సహిస్తూ మౌనంగా వ్యూహాలు అమలు చేస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 21 మంది ఎమ్మెల్యేలలో కొందరు తమ వారసులను రంగంలోకి దించాలనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితి జనసేన పార్టీ అసలు సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు ప్రజల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. వారసత్వం కంటే ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేయడమే ఆయన విధానంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఆయన ఇదే విధంగా టికెట్లు ఇచ్చారు. కాకినాడ రూరల్ నుంచి నానాజీ , రైల్వే కోడూరు నుంచి అరవ శ్రీధర్ వంటి వారికి అవకాశం కల్పించారు. వీరంతా తమ పనితీరు ద్వారా గుర్తింపు పొందిన వారే.

ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ తీసుకునే నిర్ణయం కీలకం అవుతుంది. మొత్తంగా చూస్తే, జనసేన పార్టీ సిద్ధాంతాలు ఒకవైపు, నాయకుల వ్యక్తిగత ఆశయాలు మరోవైపు ఉన్న పరిస్థితి ఏర్పడింది. పవన్ కళ్యాణ్ ఈ రెండింటి మధ్య ఎలా సమతుల్యం పాటిస్తారు, వారసత్వ రాజకీయాలపై ఎంతవరకు రాజీ పడతారు అనేది వచ్చే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.

================

# బెజవాడలో ఏం జరుగుతోంది....

విజయవాడ, మార్చి 25

ఉగ్రవాదులతో సంబంధం ఉందని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు విజయవాడ సీసీఎం కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి ఉగ్రవాద భావజాలాన్ని యువతలో ప్రోత్సహించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విజయవాడలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని.. సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ డానిష్, మీర్జా సొహైల్ మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ యువకులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి నిధులు సమకూరుతున్నట్లు నిఘావర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ముగ్గురు నిందితులను విజయవాడ పోలీసులను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏప్రిల్ ఆరో తేదీ వరకూ కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు వీరిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. మరోవైపు విచారణ సందర్భంగా లాయర్‌ను నియమించుకున్నారా? అని న్యాయమూర్తి



నిందితులను ప్రశ్నించారు. అయితే తాము నియమించుకోలేమని నిందితులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.మరోవైపు ఈ కేసులో యాంటీ టెర్రరిస్ట్ దళాలు జరిపిన విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముగ్గురు యువకులు ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఏడు రాష్ట్రాలలో 42 మంది సభ్యులతో ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రూపు ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ముఖానికి మాస్కులతో ఫోటోలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు, ఆడియోలు పెడుతున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్ , అఫ్గానిస్తాన్‌లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు

# అనంతలో ఓపెన్ కూలింగ్ సిస్టమ్

అనంతపురం, మార్చి 25,

సవి కాలంలో వాహనదారులకు ఉపశమనం కలిగించేలా అనంతపురంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సురేష్ నాయక్ అనే ఉపాధ్యాయుడు ఆలోచనతో దీనిని రూపొందించారు. ప్రయోగాత్మకంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనదారులపై తుంపర్లుగా నీటిని చల్లుతారు. దీంతో ఎండవేడిమి నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమండిపోతున్నాడు. మార్చి నెల మధ్యలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో భానుడి ఉగ్రరూపం మరోస్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయపడిపోతున్నారు. ఇక ఎండాకాలంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి. ఓ వైపు సుర్రుమనిపించే సూరీడు.. మరోవైపు వేడిగాలులు.. దీంతో ఉక్కబోతను భరించలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక వాహనదారుల పరిస్థితి అయితే చెప్పక్కర్లేదు. పైన ఎండ, కింద బండి వేడితో ఇబ్బందుల పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే అనంతపురం జిల్లాలో ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.రాజేంద్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సురేష్ నాయక్ బుర్రలో మెదిలిన ఆలోచన ఇది. వేసవి తాపం నుంచి వాహనదారులకు ఉపశమనం కల్గించేందుకు సురేష్ నాయక్..ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఆలోచన చేశారు. ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఎండలకు వాహనదారులు ఇబ్బందులు పడకుండా సప్తగిరి సర్కిల్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు.ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ అంటే.. ఒక డ్రమ్ములో నీళ్లను నింపుతారు. ఈ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా తుంపర్లుగా.. రోడ్డుపైనే వెళ్లే వాహనదారులపై వదులుతారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో కూడలి వద్ద ఉన్న వాహనదారులపై తుంపర్లు, తుంపర్లుగా నీరు పడటంతో.. వాతావరణం చల్లబడటంతో పాటుగా.. వారికి కాస్త ఉపశమనంగా ఉంటుందని అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ కారణంగా అనంతపురంలోని వాహనదారులు కాస్త రిలీఫ్ పొందుతున్నారు.

# ఢిల్లీలోనూ నెంబర్ 11 తంటా

విజయవాడ, మార్చి 25,

ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు విషయం.. ఏపీలో ఇప్పుడు ఆసక్తికర చర్చకు కారణమైంది. గదుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా స్పీకర్ కార్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11వ నంబర్ గది కేటాయించింది. పార్టీల బలాబలాల ఆధారంగా స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీల కోసం నూతన పార్లమెంట్ భవనం ఫస్ట్ ఫ్లోర్‌లోని 11వ నంబర్ గదిని కేటాయించారు. అయితే వైసీపీ ఎంపీలు.. తమ గదిని మార్చాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన వైసీపీ ఎంపీలు.. తమకు 11వ నెంబర్ గద వద్దని కోరినట్లు తెలిసింది. అందుకు బదులుగా మరో గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న స్పీకర్.. వైసీపీ ఎంపీల కోసం 12వ నంబర్ రూమ్ కేటాయిస్తూ మార్పులు చేశారు.మరోవైపు నూతన పార్లమెంట్ భవనంలో టీడీపీకి 9వ నంబర్ గది కేటాయించారు. మొదటి అంతస్తులోని 9వ నంబర్ గదిని టీడీపీ ఎంపీల కోసం కేటాయించారు. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావటంతో.. పాత పార్లమెంట్ భవనంలో ఉన్న పార్టీ ఆఫీసులనుఖాళీ చేయిస్తున్నారు. నూతన పార్లమెంట్ భవనంలో పార్టీలకు గదులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి 12, టీడీపీకి 9వ నంబర్ గదులు కేటాయించామరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లలో విజయం సాధించిన వైసీపీ.. 2024లో మాత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మంత్రివర్గంలోని నేతలందరూ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ సామర్థ్యంలో పది శాతం సీట్లు సాధించకపోవటంతో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.ఇదే సమయంలో వైసీపీ 11 సీట్లను పరోక్షంగా ఉద్దేశిస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తుంటారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవనంలో వైసీపీకి 11 నంబర్ గది కేటాయించడం.. ఆ తర్వాత వైసీపీ ఎంపీల అభ్యర్థనతో దానిని 12వ నంబర్ గదికి మార్చటం చర్చనీయాంశమవుతోంది.

# రూరల్ డెవలప్మెంట్ ట్రస్టుకు లైన్ క్లియర్

కర్నూలు, మార్చి 25

కరువు సీమలో వెలుగులు నింపిన చరిత్ర రూరల్ డెవలప్మెంట్ ట్రస్టుదిదశాబ్దాలుగా అనంతపురం జిల్లాలోని లక్షలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపింది. అటువంటి ట్రస్ట్ మనుగడపై గత నీలి నీడలు అలుముకున్నాయి. ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు లభించక విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఆ సమస్త సేవలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇటువంటి తరుణంలో మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకున్నారు. ఆయన చొరవతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కు కొత్త ఆశలు చిగురించాయి. లోకేష్ ప్రయత్నం ఫలించింది. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిలబడగలిగింది.కరువు సీమలో ఆర్టిడి అంటే కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. పేదల బతుకులు ఆశా కిరణం. అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ వ్యాప్తంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,, కరువు కోరల్లో చిక్కుకున్న రైతుల సాధికారతకు చాలా కృషి చేసింది. దశాబ్దాల కిందట చిన్న ఆశయంతో మొదలైన ఈ సంస్థ నేడు లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతూ.. దేశంలోనే అత్యంత ప్రభావంతమైన స్వచ్ఛంద సంస్థగా ఎదిగింది. వైద్యం, విద్య,, మహిళా సాధికారత, వికలాంగుల సంక్షేమం వంటి రంగాల్లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అసాధారణంఅయితే ఇటీవల రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కు విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఎఫ్ సి ఆర్ ఏ( టఇతీజీ ) అనుమతులు రద్దు రూపంలో ఎదురు దెబ్బ తగిలింది. దీంతో సేవా కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఎదురయింది. ఈ పరిణామంతో రాయలసీమలోని వేలాది పేద కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి నారా లోకేష్ తక్షణం స్పందించారు. ట్రస్ట్ పారదర్శకమైన సేవలను పరిగణలోకి తీసుకొని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ రిజిస్ట్రేషన్ ను పునరుద్ధరించింది. దీంతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ మళ్లీ నిధులను సేకరించి సేవా కార్యక్రమాలను ఆటంకం లేకుండా కొనసాగించే అవకాశం దక్కింది. అయితే ఈ ట్రస్ట్ సేవలను పునరుద్ధరించడంలో మంత్రి లోకేష్ చూపిన చొరవ ప్రశంసలు అందుకుంటోంది.

# అధికార పార్టీలకు అడ్వాంటేజ్

విజయవాడ, హైదరాబాద్, మార్చి 25, (

దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నియోజకవర్గాల పునర్విభజన చేసిన తర్వాతే వచ్చే ఎన్నికలు జరుగుతాయని కేంద్రం క్లారిటీ ఇస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదు, అది రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసే గేమ్ ఛేంజర్ . 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన, 2029 ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ యోచన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 26 ప్రకారం సీట్ల పెంపుదల అంశం మళ్లీ తెరపైకి రావడంతో, ఏ ప్రాంతానికి ఎన్ని సీట్లు వస్తాయి? ఏ పార్టీకి లబ్ధి చేకూరుతుంది? అనే విశ్లేషణలు మొదలయ్యాయి.చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 175 నుండి 225కు, తెలంగాణలో 119 నుండి 153కు పెరగాల్సి ఉంది. అంటే ఏపీలో అదనంగా 50 స్థానాలు, తెలంగాణలో 34 స్థానాలు కొత్తగా రానున్నాయి. అయితే, రిపోర్టుల ప్రకారం ప్రతి రాష్ట్రంలో 50 శాతం మేర సీట్లు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే ఏపీలో సీట్ల సంఖ్య 260 దాటవచ్చు, తెలంగాణలో 180కి చేరుకోవచ్చు. ఈ పెరుగుదల రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది కానుంది.తెలంగాణ విషయానికి వస్తే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల్లో అత్యధిక సీట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. పునర్విభజన జరిగితే ఈ ఒక్కో నియోజకవర్గం రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విడిపోయే ఛాన్స్ ఉంది. దీనివల్ల రాష్ట్ర రాజకీయం మరింతగా పట్టణ ప్రాంతాల ఓటర్లపై ఆధారపడే పరిస్థితి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో సీట్ల పెరుగుదల తక్కువగా ఉంటే, అధికార పీఠం దక్కించుకోవడంలో అర్బన్ ఓటింగ్ అత్యంత కీలకం కానుంది.ఏపీలో సీట్ల పెంపు ప్రాంతాల వారీగా తీవ్ర ప్రభావం చూపనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో జనాభా సాంద్రత ఎక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి నగరాల పరిధిలో కొత్త నియోజకవర్గాలు పుట్టుకొస్తాయి. దీనికి భిన్నంగా రాయలసీమలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉండటంతో, అక్కడ సీట్ల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగకపోవచ్చు. ఇది అసెంబ్లీలో రాయలసీమ ప్రాంతం యొక్క రాజకీయ బలాన్ని కొంత తగ్గించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.సీట్ల సంఖ్య పెరగడం వల్ల రాజకీయ పార్టీల్లో కొత్త తలనొప్పులు మొదలవుతాయి. నియోజకవర్గాల పరిధి తగ్గడం వల్ల స్థానిక నాయకత్వం బలం పెరుగుతుంది. పెద్ద నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు బలమైన నేతలు ఉన్న చోట, సీట్ల పెంపు వల్ల గ్రూపు తగాదాలు తగ్గే అవకాశం ఉన్నా, కొత్తగా ఏర్పడే స్థానాల్లో తమ వర్గాన్ని నిలబెట్టుకునేందుకు అగ్రనేతలు పోటీ పడతారు. అలాగే, మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే, పెరిగిన సీట్లలో అధిక భాగం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. ఇది పురుష రాజకీయ నేతల ఆధిపత్యానికి గండి కొట్టే అంశం. 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల జనాభా నియంత్రణ పాటించిన ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన కూడా ఉంది. ఉదాహరణకు, అమరావతి లేదా విశాఖ వంటి ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో జనాభా భారీగా పెరిగింది, కానీ 2011 లెక్కలనే వాడితే ఆ మార్పులు ప్రతిబింబించవు. అయినప్పటికీ, సీట్ల పెంపుదల వల్ల అసెంబ్లీలో ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, పాలన ప్రజలకు మరింత చేరువవుతుందన్నది సానుకూల అంశం. 2029 నాటికి జరగబోయే ఈ నియోజకవర్గాల పునర్విభజన తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త రాజకీయ శకానికి తెరతీయనుంది. ప్రాంతీయ బలాబలాలు, సామాజిక సమీకరణాలు , పార్టీల వ్యూహాలు అన్నీ కలిపి అధికార పార్టీలకు అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# కవచ్ టెక్నాలజీతో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ

చెన్నై, మార్చి 25,

భారతదేశ గర్వకారణమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రధానంగా చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ లో రూపుదిద్దుకుంటున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు, అత్యాధునిక సాంకేతికతకు నిలువుటద్దం. కేవలం చెన్నైలోనే కాకుండా, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాయ్‌బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ, లాతూర్, సోనిపట్‌లలో కూడా వీటి తయారీకి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కేవలం 52 సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగల సామర్థ్యం ఈ రైళ్ల సొంతం. ప్రయాణికుల భద్రత కోసం 'కవచ్' టెక్నాలజీ, సౌకర్యం కోసం 180 డిగ్రీలు తిరిగే సీట్లు వీటి ప్రత్యేకత.పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ వందే భారత్ రైళ్లు భారతీయ రైల్వే విప్లవం అని చెప్పక తప్పదు. తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వందే భారత్ రైళ్లకు జన్మస్థానం. 2018లో మొట్టమొదటి ట్రైన్ 18 (వందే భారత్) ఇక్కడే తయారైంది. అత్యుత్తమ ఇంజనీర్లు, ఆధునిక యంత్రాల సాయంతో ప్రతి కోచ్‌ను ఇక్కడ అత్యంత జాగ్రత్తగా తీర్చిదిద్దుతారు.ప్రస్తుతం వందే భారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. దీన్ని చేరుకోవడానికి రైల్వే శాఖ తయారీని ఇతర కేంద్రాలకు కూడా విస్తరించింది. ఉత్తరప్రదేశ్‌లోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీలో కొత్త కోచ్‌ల తయారీ జరుగుతోంది.లాతూర్ ఁ సోనిపట్: మహారాష్ట్రలోని లాతూర్ మరియు హర్యానాలోని సోనిపట్ రైల్వే యూనిట్లలో కూడా తయారీ పనులు వేగవంతం చేశారు.వందే భారత్ కేవలం ఒక రైలు మాత్రమే కాదు, అదొక సాంకేతిక అద్భుతం. ఇది గరిష్టంగా గంటకు 160-180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. రైళ్ల మధ్య ఢీకొనే ప్రమాదాన్ని నివారించే కవచ్ వ్యవస్థ ఇందులో ఉంది. మరింత ప్రత్యేకంగా సెల్ఫ్-ప్రొపెల్డ్ ఇంజిన్ (ఇంజిన్ విడిగా ఉండదు), ఆటోమేటిక్ తలుపులు, వై-ఫై, మరియు జీపీఎస్ ఆధారిత సమాచార వ్యవస్థ ప్రయాణికులకు లభిస్తాయి.మేక్ ఇన్ ఇండియా విజన్ కింద తయారవుతున్న ఈ రైళ్లు ప్రపంచ స్థాయి ప్రమాణాలను కలిగి ఉన్నాయి. భవిష్యత్తులో వందే భారత్ స్లీపర్ వెర్షన్లు, మెట్రో వెర్షన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా భారతీయ రైల్వే అడుగులు వేస్తోంది.

==============

# పెట్రోల్ బంకుల దగ్గర బారులు తీరిన వాహనదారులు

హైదరాబాద్ మార్చి 25,

అమెరికా ఇరాన్,ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం తెలంగాణలోని అన్ని పెట్రోల్ పంపుల పై పడింది. ఎక్కడ పెట్రోల్ పంపులు వద్ద పెట్రోల్ లేదని దొరకదేమో అనే భయంతో జనాలు బార్లు తీరారు. ప్రతిరోజు ఉద్యోగాలకు వెళ్లాలి బయటికి వెళ్లాలన్న బండ్లలో పెట్రోల్ తప్పనిసరి అలాంటి పెట్రోల్ లేకపోతే తమ దినచర్యలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జనాలు గంటలు తరబడి క్యూ లైన్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ ఏ పెట్రోల్ పంపు చూసినా భారీగా క్యూలైన్ కనిపిస్తున్నాయి. కొన్ని పెట్రోల్ పంపులు నో స్టాక్ బోర్డులు పెట్టేసి ఉండడంతో జనాలు భయాందోళన గురవుతున్నారు రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని మహిళా తో పల్లి శంషాబాద్ అత్తాపూర్ గండిపేట్ పలు ప్రాంతాల్లో ఎక్కడ పంపుల వద్ద చూసిన ఇదే పరిస్థితి కనిపిస్తుంది

# పోలీస్ వాహనాన్ని ఢీ కొట్టిన ఇసుక ట్రాక్టర్

తాండూరు మార్చి 25,

వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం బషీరాబాద్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇసుక ట్రాక్టర్ వాహనము పోలీస్ రక్షక వాహనాన్ని ఢీ కొట్టింది. వివరాలకు వెళ్తే .. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీశైలం యాదవ్ బీట్ నిర్వహిస్తుండగా మంగళవారం ఉదయం తెల్లవారుజామున మండల లోని దామర్చాడ్ గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీశైలం యాదవ్ వాహనాన్ని చూసి అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ వాహనం నడుపుతూ ఒక్కసారిగా పోలీస్ రక్షక వాహనాన్ని ఢీ కొట్టి గనుల వైపు పరారయ్యారు. ఇసుక ట్రాక్టర్ ఎవరిది అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్ గనుల వైపు వెళ్లడంతో ఇంతవరకు ఆచూకీ లభించలేదు.

# ఏసీబీ వలలో ఎంవిఐ

ఖమ్మం జిల్లా మార్చి 25,

వైరా రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమేష్ దాడులు నిర్వహించారు. ఎంవిఐ వరప్రసాద్ అసిస్టెంట్ రాజశేఖర్ ఇటుక బట్టీ వ్యాపారి నుంచి 24 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కారులో అనధికారికంగా ఉన్న 50వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎంవిఐ వరప్రసాద్ ను అరెస్టు చేపారు. అక్కడ ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ ఇంటిపై సోదాలు చేపట్టారు.

# ఎడతెగని భద్రాద్రి పంచాయితీ

ఖమ్మం, మార్చి 25, (న్యూస్ పల్స్)

మనదేశంలో.. ముఖ్యంగా దక్షిణాది ప్రాంతంలో ఒక మనిషి పేరుకు ముందు ఇంటి పేరు ఉంటుంది. ఆ తర్వాత కులం.. అనంతరం గోత్రం ఉంటుంది.. ఇది ఇప్పటిది కాదు.. తరతరాలుగా సాగుతూ వస్తోంది. కులాన్ని.. గోత్రాన్ని కొంతమంది వ్యతిరేకించినప్పటికీ.. చాలామంది నేటికీ అనుసరిస్తూనే ఉంటారు..కులాలు.. గోత్రాలు కేవలం మనుషులకు మాత్రమే కాదు.. దేవతామూర్తులకు కూడా ఉంటాయి. దేవతామూర్తులకు కులాలను.. గోత్రాలను ఆపాదించడం ఈనాటిది కాదు.. దాని వెనక ఏళ్ల చరిత్ర ఉంది. ఆయా దేవుళ్లను వివిధ కులాలవారు ఆపాదించుకోవడం పరిపాటిగా మారింది.ఇప్పటివరకు కులాలు.. గోత్రాల విషయంలో ఏ దేవుళ్ళు కూడా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. వివాదాస్పదమైన సందర్భాలు కూడా లేవు. అయితే తొలిసారిగా ఇటువంటి ఇబ్బందులు శ్రీ సీతారామ చంద్రుడు ఎదుర్కొంటున్నాడు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. సీతారామ చంద్రుడికి ఆస్థాయిలో ఇబ్బంది ఎందుకు కలిగింది.. గోత్రం విషయంలో స్వామివారు ఎందుకు కోర్టు మెట్లు ఎక్కారు.. ఈ ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానమే ఈ కథనభద్రాద్రి రామయ్య గోత్రం వశిష్ట. సీతమ్మది గౌతమస గోత్రం. ఈ గోత్రాల పేర్లను చదువుతూ అర్చకులు పూజలు చేస్తూ ఉంటారు. 2012 తర్వాత పండితులు స్వామివారిని అచ్యుత.. అమ్మవారిని సౌభాగ్య గోత్రాలుగా చదువుతున్నారు. ఈ మార్పు వెనుక ఉద్దేశం ఏమిటో తెలియదు. అయితే సీతారామ చంద్రుల గోత్రాలను 2012 నుంచి మార్చి చదువుతున్నారని ఓ భక్తుడు కోర్టు దాకా వెళ్లాడు. 2022లో తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు ఒక కమిటీ ఏర్పాటు అయింది. ఆ కమిటీ దేవాదాయ శాఖకు నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికను దేవాదాయ శాఖ బయట పెట్టలేదు. దీంతో ఆ వ్యక్తి మళ్ళీ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ సున్నితమైన వివాదంపై కోర్టు ఎలా విచారిస్తుంది? ఎటువంటి తీర్పు ఇస్తుంది అనేది చూడాల్సి ఉంటుంది.సీతారామచంద్రస్వామికి గురువారం రోజుల్లో కళ్యాణం.. మరో శుక్రవారం పట్టాభిషేకం జరుగుతాయి. ఇంతటి మహత్కార్యాల ముందు స్వామివారు గోత్రానికి సంబంధించి వివాదం ఎదుర్కోవడం.. అది కూడా కోర్టు దాకా వెళ్లడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. స్వామివారి గోత్రాలను మార్చి ఎందుకు చదువుతున్నారు.. గతంలో చదివిన వాటిని ఎందుకు పక్కన పెట్టారు.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు.

# వ్యూహాత్మకంగా దెబ్బ తీస్తున్న రేవంత్



హైదరాబాద్, మార్చి 25,

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా బలహీనం చేయాలనుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన మొదటగా ఆ పార్టీ ముఖ్యనేతలను బలహీనం చేయాలనుకుంటున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల కంచుకోటలను బద్దలు కొట్టాలనుకుంటున్నారు. సిద్ధిపేట, గజ్వేల్, సిరిసిల్ల ఈ మూడు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఈ కోటలనే లక్ష్యంగా చేసుకుని, గులాబీ దళపతులైన హరీష్ రావు, కేసీఆర్, , కేటీఆర్‌లను రాజకీయంగా బలహీనపరిచేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీఆర్ఎస్ అగ్రనేతల సొంత నియోజకవర్గాల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దీనికి స్పష్టమైన సంకేతం. హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటలో అడుగుపెట్టిన రేవంత్, అక్కడ అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపుతూనే, రాజకీయంగా ఆధిపత్యం సాధించేందుకు పావులు కదుపుతున్నారు. కేవలం గెలవడమే కాదు, ప్రత్యర్థి నాయకత్వాన్ని స్థానికంగా దెబ్బతీయాలన్నది రేవంత్ మాస్టర్ ప్లాన్. రేవంత్ రెడ్డి అనుకుంటున్నంత సులభంగా ఈ మూడు నియోజకవర్గాల్లో మార్పు రావడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిద్ధిపేటలో హరీష్ రావుకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, గజ్వేల్‌లో కేసీఆర్ పట్ల ఉన్న సెంటిమెంట్, సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఆ నాయకులను ప్రజలకు దగ్గర చేశాయి. ఈ ముగ్గురూ తమ నియోజకవర్గాల్లో కేవలం రాజకీయ నాయకులుగానే కాకుండా, కుటుంబ సభ్యులుగా స్థిరపడిపోయారు. వారిని ఢీకొనాలంటే కేవలం అధికార బలం సరిపోదు, అంతకు మించిన ప్రజాదరణ ఉన్న నేతలు కాంగ్రెస్ వైపు ఉండాలి. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడం. సిద్ధిపేటలో హరీష్ రావుకు దీటైన నాయకుడు కానీ, సిరిసిల్లలో కేటీఆర్‌ను అడ్డుకోగల చరిష్మా ఉన్న నేత కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కనిపించడం లేదు. ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడకుండా, కేవలం పైస్థాయి నుంచి చేసే విమర్శలు ఓట్లుగా మారవు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, బీఆర్ఎస్ అగ్రనేతల ప్రభావాన్ని తగ్గించగలిగే మాస్ లీడర్ల అవసరం కాంగ్రెస్‌కు ఉంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు. గతంలో ఇంద్రుడిలా వెలిగిన ఎందరో అగ్రనేతలు తమ సొంత గడ్డపైనే ఓటమి పాలైన చరిత్ర ఉంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. ప్రభుత్వ పథకాలను ఈ నియోజకవర్గాల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, బీఆర్ఎస్ కేడర్‌ను ఆకర్షించడం ద్వారా ఆ కోటలను బీటలు వారేలా చేయవచ్చు. ముఖ్యంగా అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారనే ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని కలిగించడం రేవంత్ ముందున్న సవాలు. రేవంత్ రెడ్డి సంకల్పం గట్టిగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని మర్చిపోయేలా చేసే స్థాయి ఉన్న నేతలు స్థానికంగా ఎదిగితేనే కాంగ్రెస్‌కు అక్కడ భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ రేవంత్ రెడ్డి ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయగలిగితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మలుపు అవుతుంది. ఇప్పటికే అక్కడ బలమైన నేతల్ని గుర్తించి ప్రోత్సహించే వ్యూహాన్ని రేవంత్ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల్ని రెడీ చేసుకున్నా అది బీఆర్ఎస్ పార్టీ వ్యూహాల్లో కీలకమైన మార్పులు తెస్తుంది. మరి రేవంత్ రాజకీయం ఈ సారి ఆయన వ్యూహాలకు తగ్గట్లుగా సాగుతుందా?

# అన్నాడీఎంకే వింత హామీలు..

చెన్నై, మార్చి 25,

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరానికి అన్నా డీఎంకే అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో 297 వాగ్దానాలతో కూడిన భారీ మేనిఫెస్టోను విడుదల చేశారు. సామాన్యులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రకటించిన ఈ పథకాలు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. అమ్మ పాలనను గుర్తుచేసేలా ఇంటికో ఫ్రిడ్జ్, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి హామీలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.ఈ మేనిఫెస్టోలో అత్యంత ఆకర్షణీయమైన అంశం పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం . ప్రస్తుతం అధికార డీఎంకే ప్రభుత్వం కేవలం మహిళలకు మాత్రమే కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని, అన్నా డీఎంకే తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించింది. దీనితో పాటు, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక రిఫ్రిజిరేటర్ ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. గతంలో మిక్సీలు, గ్రైండర్లు ఇచ్చిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు ఫ్రిడ్జ్‌ను జాబితాలో చేర్చారు. మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్నా డీఎంకే వరాల జల్లు కురిపించింది. కుల విళక్కు పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళా యజమానికి నెలకు రూ. 2,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. అలాగే, ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని, నిలిపివేసిన తాళికి బంగారం మంగళసూత్రం కోసం బంగారం ,వివాహ ఆర్థిక సాయం పథకాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టం చేసింది. ఆడపిల్లల రక్షణ పథకం కింద ఇచ్చే ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని రూ. 50 వేల నుండి రూ. 1 లక్షకు పెంచుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు , కుటుంబాల సౌభాగ్యం కోసం సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని అన్నా డీఎంకే వాగ్దానం చేసింది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ మద్యం దుకాణాలను దశలవారీగా మూసివేస్తామని ఎడప్పాడి పళనిస్వామి భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయం మహిళా లోకం నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుందని పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది.యువతను ఆకట్టుకోవడానికి నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 2,000 చొప్పున భృతి కల్పిస్తామని, ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, వృద్ధాప్య పింఛన్ల పెంపు వంటి అంశాలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. అన్నా డీఎంకే ప్రకటించిన ఈ ఉచిత పథకాలు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. డీఎంకే పథకాలకు ధీటుగా, అంతకు మించిన హామీలను గుప్పించడం ద్వారా పీఠాన్ని దక్కించుకోవాలని అన్నా డీఎంకే గట్టి పట్టుదలతో కనిపిస్తోంది.

======================

# పల్లె నిద్ర' తో ప్రజలకు మరింత చేరువగా పోలీసులు

కడప మార్చి 25,

ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లెలమ్మ పల్లి గ్రామంలో ఎస్.ఐ శ్రీప్రియ రి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి.. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో చాలామంది వ్యక్తులు సైబర్ మోసాలకు గురవుతున్నారని, నేరాలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించి, అప్రమత్తంగా ఉండాలని కోరారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది సైబర్ నేరగాళ్ళు వాట్సాప్ కాల్స్ చేసి తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటి నుండి బయటకు వెళ్ళ వద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని, ఆధార్ కార్డును దుర్వినియోగం చేసారని, మీ పిల్లలపై డ్రగ్స్ కేసు నమోదయ్యిందని, సిబిఐ లేదా ఎన్ఫోర్స్మెంట్ లేదా సిఐడి లేదా కోర్టు నుండి అధికారులుగా పరిచయం చేసుకొని, బెదిరింపులకు పాల్పడుతుంటారని, చివరకు సహాయం చేస్తున్నట్లుగా నమ్మబలికి, అమాయకుల నుండి డబ్బులను కొల్లగొడుతున్నారన్నారు. ఇటువంటి నేరగాళ్ళు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, ఎవరైనా ఈ తరహాలో ఫోన్ కాల్ వస్తే సమాచారాన్ని డయల్ 112 లేదా 1930కు అందించాలని ఎస్.ఐ సూచించారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, ఉత్తమ మార్గంలో నడిపి, ఉన్నత స్థానాలకు చేరుకొనే విధంగా చూడాలన్నారు. చ

# తెలంగాణ సెమాగ్లుటైడ్ బ్యాన్

హైదరాబాద్, మార్చి 25,

బరువు తగ్గడం కోసం, మధుమేహ నియంత్రణ కోసం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందుతున్న సెమాగ్లుటైడ్ మెడిసిన్ వాడకంపై తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా, సొంత నిర్ణయాలతో ఈ మందులను వాడటం వల్ల ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల ఈ ఔషధాలకు సంబంధించిన పేటెంట్ గడువు ముగియడంతో మార్కెట్‌లోకి అనేక రకాల కొత్త ఫార్ములేషన్లు అందుబాటులోకి వస్తున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. సెమాగ్లుటైడ్ అనేది గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 రిసెప్టర్ అగోనిస్ట్స్ అనే తరగతికి చెందిన ఔషధం. ఇది శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతోపాటు, ఆకలిని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా టైప్ -2 డయాబెటిస్ బాధితులకు ఇది ఒక వరప్రసాదంగా మారింది. అయితే ఇటీవల కాలంలో కేవలం బరువు తగ్గడం కోసమే దీనిని వాడే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. గత వారమే ఈ ఔషధాల అసలు ఆవిష్కర్త పేటెంట్ గడువు ముగిసింది. దీని వల్ల వివిధ కంపెనీలు మల్టీ డోస్ వయల్స్, ప్రీ- ఫీల్డ్ పెన్స్ రూపంలో సెమాగ్లుటైడ్ ఫార్ములేషన్లు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న ఈ మందులపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ విక్రయాలు జరిగే అవకాశం ఉందని ఆఅం గుర్తించింది. తెలంగాణ డీసీఏ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సెమాగ్లుటైడ్ కేవలం రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ల పర్యవేక్షణలో వాడాలి. ఎండోక్రినాలజిస్టులు, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్టులు మాత్రమే ఈ మందులను ప్రిస్క్రైబ్ చేయాలి. గుండె సంబంధిత సమస్యలు ఉండి, ఆమోదించే సంకేతాలు ఉన్న సందర్భాల్లో మాత్రమే కార్డియాలజిస్టులు దీనిని సూచించవచ్చు. రోగికి ఈ మందును సూచించే ముందు వారి ఆరోగ్య చరిత్ర, ఇప్పటికే ఉన్న ఇతర వ్యాధులు, ఎదురయ్యే ముప్పును వైద్యులు నిశితంగా పరిశీలించారు. సరైన మోతాదు, ఎంత కాలం వాడాలి అనే విషయాలను నిపుణులైన డాక్టర్లు మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుంది.

అజాగ్రత్తా వాడితే పొంచి ఉన్న సమస్యలు

సరైన వైద్య పర్యవేక్షణ లేని పక్షంలో సెమాగ్లుటైడ్ వాడకం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని డీసీఏ హెచ్చరించింది. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్ అంటే క్లోమగ్రంథి వాస్తుంది. మూత్రపిండాలు ఒక్కసారిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. విపరీతమైన కడుపు నొప్పి, వాంతులు, ఇతర తీవ్రమైన ప్రతి చర్యలు ఉంటాయి. గాల్ బ్లాడర్‌లో రాళ్లు రావడం, ఇతర సమస్యలు రావచ్చు. ప్రజలు సెమాగ్లుటైడ్ మెడిసిన్‌ను కేవలం లైసెన్స్ ఉన్న మెడికల్ షాపులో నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, అనధికారక విక్రేతల వద్ద, ఇతర చట్టవిరుద్ధమైన మార్గాల ద్వారా వీటిని ఆర్డర్ చేయొద్దు. ఇలాంటి మార్గాల్లో లభించే మందులు నకిలీవి, నాణ్యత లేనివి, హాని చేసేవి అయ్యి ఉంటాయని హెచ్చరించింది.

తయారీదారులకు హెచ్చరిక

మందుల తయారీ కంపెనీలకు కూడా ప్రభుత్వం కఠిన ఆదేశాలు జారీ చేసింది. సెమాగ్లుటైడ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ఎటువంటి పరోక్ష ప్రకటనలు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా లేదా అన్ అప్రూవ్డ్ వాడకాన్ని ప్రోత్సహించేలా ప్రమోషన్లు చేస్తే చర్యలు తప్పవని చెప్పింది. ఒక వేళ ఎక్కడైనా ఈ మందులను అక్రమంగా విక్రయిస్తున్నట్టు తెలిసినా, అనధికారికంగా ప్రచారం చేస్తున్నట్టు గమనించినా వెంటనే తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలను కోరారు.

# గద్దర్ అవార్డ్స్ లో స్కాం...!
## రెండు కోట్లకు టెండర్... నాలుగు కోట్ల ఖర్చా...

హైదరాబాద్, మార్చి 25,

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో కుంభకోణం జరిగిందా.. కోట్ల రూపాయలు దారి మళ్లాయా? ఇందులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారా.. ముందుగా అనుకున్న దానికంటే.. ఎక్కువ ఖర్చు పెట్టారా.. ఇందులో ఎవరి పాత్ర ఎంత.. ఇప్పుడు ఇవే విషయాలను బయటపెట్టారు గులాబీ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.గద్దర్ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసిందని శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. జ్యూరి సభ్యులను.. సినీ పెద్దలను అవమానించారని విమర్శించారు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన వ్యవహారంపై ప్రభుత్వం నోరు విప్పాలని.. ఎఫ్ డీ సీ చైర్మన్.. సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న హైటెక్స్ లో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను అందజేత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను విజ్ క్రాఫ్ట్ అనే ముంబైకి చెందిన కంపెనీకి అప్పగించింది. అయితే అందులో ఉన్న లెక్కలకు సంబంధించిన ఓ కాపీ బయటికి వచ్చింది. దీనిని శ్రవణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.అవార్డుల ఫంక్షన్ లో శ్రేయ ఘోషల్ కు 1,65,00,000, దేవిశ్రీప్రసాద్ కు 60,00,000, దేవిశ్రీప్రసాద్ టెక్ రైడర్ కు 20,00,000, నిధి అగర్వాల్ కు 20,00,000, 10,50,000, 6,50,000, వ్యాఖ్యాతలు సుమ, ప్రదీప్ కు 13 లక్షలు, కొరియోగ్రఫీ చేసిన వారికి 39,20,000, కాస్ట్యూమ్స్ కు ఐదు లక్షలు.. ప్రయాణానికి.. బస, భోజనాల ఖర్చుకు 60 లక్షలు.. రెడ్ కార్పెట్ యాంకర్లకు ఏడు లక్షలు.. హెయిర్.. మేకప్ వేసిన వారికి ఐదు లక్షలు.. మొత్తం ఆర్టిస్టుల ఖర్చు నాలుగు కోట్ల 11 లక్షల 20,000 బిల్లు అయింది.. వేదిక.. లైటింగ్.. ఇతర ఖర్చులకు భారీగా వెచ్చించారని శ్రవణ్ ఆరోపించారు. ఇక ఇదే డాక్యుమెంట్లో టెండర్ కాస్ట్ కాలంలో రెండు కోట్ల 13 లక్షలని ఉందని.. అయితే అసలు బిల్లు మాత్రం నాలుగు కోట్ల 11 లక్షల ఇరవై వేలని.. అనుకున్న దానికంటే రెండు కోట్లు అదనంగా ఖర్చు పెట్టారని శ్రవణ్ ఆరోపించారు. ఈ అదనపు ఖర్చును ఎఫ్డిసి చైర్మన్ లేదా సినిమాటోగ్రఫీ మంత్రి భరిస్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు. విజ్ క్రాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిన వ్యక్తులు ఎవరని.. తెలంగాణ ప్రాంతంలో ఎటువంటి ఏజెన్సీలు లేవా.. దీనికి ఏమైనా ఓపెన్ టెండర్లు పిలిచారా.. లేదా ప్రభుత్వం తమకు కావలసిన వారికి కట్టబెట్టిందా అని.. శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉండిపోయాయని.. కానీ ఒకరోజు ధూంధాం వేడుకకు నాలుగు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని శ్రవణ్ ప్రశ్నించారు.

# కరీంనగర్ లో మిస్టరీ డెత్స్...

కరీంనగర్, మార్చి 25,

విరూపాక్ష సినిమా చూశారా.. అందులో ఊళ్లో వాళ్లంతా ఒక్కొక్కరుగా చనిపోతూ ఉంటారు. దీంతో ఆ గ్రామంలో ఉన్న మత పెద్ద శాసనాల గ్రంథాన్ని తెరుస్తాడు. ఊరిలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తాడు. ఊరికి కీడు జరిగిందని.. ఊరంతా ఖాళీ చేయాలని చెబుతాడు. అదంతా సినిమా కాబట్టి.. కాస్త వాస్తవానికి దూరంగానే ఉంటుంది. కానీ నిజంగా ఇలాంటి సంఘటన తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. ఇంతకీ ఈ సంఘటన ఏ గ్రామంలో జరిగింది.. అక్కడ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.. వీటిపై ప్రత్యేక కథనం..తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో గడిచిన 3 నెలలుగా వరుసగా 28 మంది చనిపోయారు. వివిధ కారణాలతో వారు చనిపోవడంతో గ్రామంలో ఆందోళన ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తమ ఊరికి ఏదో కీడు సోకి ఉంటుందని బలంగా నమ్మారు. గ్రామదేవతలకు పూజలు చేశారు. అయినప్పటికీ మరణాలు ఆగలేదు. దీంతో స్థానికంగా ఉన్న ఓ పూజారిని కలిశారు. గ్రామంలో జరుగుతున్న పరిణామాలను అతని దృష్టికి తీసుకెళ్లారు.అ పూజారి వారు చెప్పిన మాటలు మొత్తం విన్న తర్వాత.. ఒక కీలకమైన విషయాన్ని చెప్పాడు. గ్రామానికి కీడు సోకిందని.. గ్రామంలో ఉన్న వారంతా ఒకరోజు తమ తమ గృహాలను ఖాళీ చేయాలని.. పొలాల్లోకి వెళ్లి కీడు వంటలు చేసుకోవాలని చెప్పారు. దీంతో గ్రామస్తులు తెల్లవారుజామునే వారి వారి గృహాలకు తాళాలు వేశారు. డప్పు చాటింపు చేశారు. అందరూ కలిసి ముకుమ్మడిగా గ్రామం దాటి వెళ్లిపోయారు. తన పొలాల్లో కీడు వంటలు చేసుకొని.. పితృదేవతలకు పెట్టి.. ఆ తర్వాత భుజించారు. ఇలా చేస్తే తమ గ్రామానికి పట్టిన కీడు తొలగిపోతుందని అక్కడి ప్రజలు నమ్ముతున్నారు.మూడు నెలల్లో 28 మంది చనిపోవడంతో ఆ గ్రామంలో ఒక రకమైన ఆందోళన ఏర్పడింది. ఇందులో కొంతమంది అనారోగ్యంతో చనిపోయారు. మరి కొంతమంది రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇంకొంతమంది బలవంతంగా ఆత్మహత్యలు చేసుకున్నారు.. 3 నెలల కాలంలోనే 28 మంది చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. జంతువులను కూడా బలులు ఇచ్చారు. అయినప్పటికీ మరణ మృదంగం ఆగలేదు. అయితే ఇప్పుడు కీడు వంటలు చేసుకున్న నేపథ్యంలో.. తమ గ్రామానికి అంతా మంచే జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకపై గ్రామంలో మరణ మృదంగం ఆగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

==============

# ఐటీ సిటీకి గండం...

హైదరాబాద్, మార్చి 25,

సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతున్న భాగ్యనగర ఐటీ కోటకు బీటలు వారుతున్నాయా? దశాబ్ద కాలంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం.. ఇప్పుడు మొదటిసారిగా తిరోగమనం వైపు అడుగులు వేస్తోందా? కేవలం గణాంకాల తగ్గుదల మాత్రమే కాదు.. ఏఐ విసిరిన సవాలు.. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి హైదరాబాద్ ఐటీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజకీయ విమర్శల వెనుక దాగి ఉన్న అసలు చేదు నిజం ఏమిటి? ఇది కేవలం ఒక తాత్కాలిక మందగమనమా లేక పెను సంక్షోభానికి సంకేతమా? అన్నది చర్చనీయాంశమైంది. హైదరాబాద్ ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గడిచిన దశాబ్ద కాలంగా అప్రతిహత వృద్ధితో దూసుకుపోయిన ఈ రంగంలో మొదటిసారిగా 'రివర్స్ ట్రెండ్' కనిపిస్తుండటం అటు నిరుద్యోగులను, ఇటు ఆర్థిక నిపుణులను కలవరపెడుతోంది. గణాంకాలు చెబుతున్న చేదు నిజం తెలంగాణ మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ సెగలను మించి ఐటీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయిందని ప్రభుత్వం స్వయంగా గణాంకాల్లో వెల్లడించడం గమనార్హం. అంటే మూడేళ్ల కాలంలో సుమారు 7,000 ఉద్యోగాల తగ్గుదల నమోదైంది. సాధారణంగా ఏటా లక్షల్లో కొత్త ఉద్యోగాలు రావాల్సిన చోట.. ఉన్నవి తగ్గిపోవడం ఐటీ హబ్‌గా హైదరాబాద్ ప్రతిష్టకు సవాలుగా మారింది. ఈ తిరోగమనానికి కేవలం స్థానిక పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో వేలాది మంది అవసరమయ్యే కోడింగ్, టెస్టింగ్ , సపోర్ట్ పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో చేస్తోంది. ఆటోమేషన్ వల్ల కంపెనీలు 'లీన్ మేనేజ్‌మెంట్' తక్కువ మందితో ఎక్కువ పని వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి: అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల ఐటీ ప్రాజెక్టుల బడ్జెట్‌లో కోతలు పడ్డాయి. మన ఐటీ రంగం ప్రధానంగా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. పాత పద్ధతుల్లో సాగే సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్ పనులు తగ్గిపోతున్నాయి. కంపెనీలు కేవలం హై-లెవల్ నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తీసుకుంటున్నాయి, దీనివల్ల కొత్తవారికి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆర్థిక వ్యవస్థపై పడనున్న 'చైన్ ఎఫెక్ట్' ఐటీ రంగం కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు. ఇది ఒక పెద్ద ఎకోసిస్టమ్. ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్, హోటల్ రంగం, రవాణా, రిటైల్ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కోత లేదా వేతనాల స్తబ్దత కొనసాగితే గృహ రుణాలు వినియోగ వస్తువుల విక్రయాలు తగ్గి, నగరం యొక్క మొత్తం ఆర్థిక చక్రం మందగించే ప్రమాదం ఉంది. ముందున్న మార్గం: నైపుణ్యమే ఆయుధం రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఐటీ రంగం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉందన్నది కాదనలేని వాస్తవం. భవిష్యత్తులో కేవలం రొటీన్ పనులు చేసేవారికి చోటు ఉండదు. "పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇది ముగింపు కాదు. జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలలో ఉద్యోగులు త్వరగా నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉంది." అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం ఉన్న కంపెనీలను కాపాడుకోవడమే కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా 'స్కిల్లింగ్ సెంటర్స్' పై దృష్టి పెట్టాలి. ఈ హెచ్చరికను గమనించి అప్రమత్తం కాకపోతే హైదరాబాద్ సాధించిన ఐటీ కీర్తి మసకబారే ప్రమాదం ఉంది.

# మూడు ఫేజ్ లలో డ్రైవింగ్ లైసెన్స్ లు

హైదరాబాద్, మార్చి 25, (

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న ఎల్ఎల్ఆర్ (ఒఒఖీ), పర్మనెంట్ డ్రైవింగ్ టెస్ట్ అనే రెండంచెల విధానానికి అదనంగా, రాష్ట్ర రవాణా శాఖ ఇకపై ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్ తప్పనిసరి చేయనుంది. ఏప్రిల్ మొదటి వారం నుండి అమలులోకి రానుందని తెలుస్తోంది. తెలంగాణలో ప్రతి ఏడాది సుమారు 7,500 మంది రహదారి ప్రమాదాల్లో చనిపోతుండగా.. వేలాది మంది గాయాల పాలవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా శాఖ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నూతన డ్రైవింగ్ లైసెన్స్ విధానంపై కసరత్తు చేసింది. ఇది అమల్లోకి వస్తే రహదారి క్రమశిక్షణ పెరిగి ప్రాణనష్టం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు మూడంచెల విధానం

ఈ విధానం ప్రకారం, లెర్నర్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునే ముందే అభ్యర్థులు రహదారి భద్రతపై అవగాహన పరీక్షను పూర్తి చేయాలి. ఇందుకోసం రవాణా శాఖ 6 ప్రత్యేక మాడ్యూళ్లను తయారుచేసింది. ఒక్కో మాడ్యూల్ 30 నిమిషాల చొప్పున మొత్తం 3 గంటల పాటు సాగే ఈ ట్రైనింగ్, ఎగ్జామ్‌ను అభ్యర్థులు ఇంటి నుంచే పూర్తి చేయవచ్చు. కెమెరా ఉన్న కంప్యూటర్, ల్యాప్‌టాప్ ద్వారా ఈ మాడ్యూల్ పూర్తి చేయవచ్చు. ఈ పరీక్షలో క్వాలిఫై అయి పొందే సర్టిఫికేట్ నంబర్ ఉంటేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మీరు అర్హులు అవుతారు. రెండో దశలో లెర్నర్ లైసెన్స్ కోసం పరివాహన్ వెబ్‌సైట్ లేదా లేదా తెలంగాణ రవాణా శాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ం (మెడికల్ సర్టిఫికేట్)తో ఫిల్ చేయాలి. నిర్వహించే ఆన్ లైన్ ఎగ్జామ్ పాస్ అయితే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. మూడో దశలో పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఒఒఖీ వచ్చిన 30 రోజుల తరువాత నుంచి 6 నెలల్లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసి.. ఆర్టీవో ఆఫీసుకు వెళ్లి అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

తెలంగాణలో 3 దశల్లో డ్రైవింగ్ లైసెన్స్.. పూర్తి ప్రక్రియ

డ్రైవింగ్ లైసెన్స్ (ఆఒ) పొందడానికి ఇప్పుడు 3 దశల ప్రక్రియ పూర్తి చేయాలి. ఏప్రిల్ 2026 నుండి ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలి. కొత్త డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు ప్రక్రియ స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇదే..

ఫేజ్ 1: ఆన్‌లైన్ రోడ్డు భద్రతా అవగాహన పరీక్ష రాయాలి

ఒఒఖీ దరఖాస్తుకు ముందు 6 మాడ్యూల్స్‌తో కూడిన 3 గంటల ఆన్‌లైన్ క్లాస్ వినాలి. తరువాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికేట్ నంబర్ పొందాలి.

ఫేజ్ 2: లెర్నర్ లైసెన్స్ (ఒఒఖీ) కోసం దరఖాస్తు చేయాలి

పరివాహన్ వెబ్‌సైట్ లేదా రాష్ట్ర రవాణాశాఖ వెబ్‌సైట్‌లో ఫారం 1, 1ం (మెడికల్ సర్టిఫికేట్)తో అప్లై చేసుకోవాలి. ఆన్‌లైన్ పరీక్షలో పాస్ అయితే ఒఒఖీ జారీ అవుతుంది.

ఫేజ్ 3: శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (ఆఒ) కోసం దరఖాస్తు

ఒఒఖీ వచ్చిన 30 రోజుల తర్వాత నుంచి 6 నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి. తరువాత ఆర్టీవో (ఖీూ) ఆఫీసు వద్ద డ్రైవింగ్ ట్రాక్‌పై అధికారులు నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు హాజరు కావాలి.

వయస్సు: 18 ఏళ్లు నిండి ఉండాలి (గేర్ లేని టూవీలర్‌కు 16 ఏళ్లు).

డాక్యుమెంట్స్: ఆధార్ కార్డ్, అడ్రస్ ప్రూఫ్, వయసు ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

50 ఏళ్లు పైబడిన వారు తప్పనిసరిగా డాక్టర్ నుండి ఫారం 1ం మెడికల్ సర్టిఫికేట్ తెచ్చి సబ్మిట్ చేయాలి.

# మేము వైయస్ జగన్ విశ్వాస పాత్రులం... మమ్ములను కుక్కలతో పోల్చిన సంతోషమే.

## జగన్ కు దమ్ము, ధైర్యం లేక కాదు మానవత్వం ఉండబట్టే జవాబు ఇవ్వలేదు

### మేము సైతాన్ సైన్యం కాదు, జగనన్న సైన్యం అందుకే వాస్తవాలను ధైర్యంగా మాట్లాడుతున్నానీ.
### .వైయస్ అవినాష్,రాచమల్లు ల వ్యాఖ్యల కు జవాబు చెప్పలేకే అసందర్భంగా ప్రేలాపనలు.
### పీసీసీ చీఫ్ షర్మిలమ్మ పై వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యనీ ఫైర్.

కడప మార్చి 25,

వైఎస్ విజయమ్మ తల్లిగా వైఎస్ జగన్ తో మాట్లాడే చనువు,బాధ్యత ఉన్నప్పటికీ మాట్లాడకుండా జగన్ రాజకీయ వతనాన్ని కోరి ... షర్మిలమ్మను రక్షించేందుకు మద్దతుగా విజయమ్మ స్టేట్మెంట్ కు నోటరీ చేసి విడుదల చేయడం కూటమినేతల కుట్రలో భాగమని,ఉన్న వాస్తవాలను వైయస్ జగన్ విశ్వాస పాత్రులనీగా వైఎస్ కుటుంబ కీర్తి మసకబారకూడదనే సదుద్దేశంతో మేము మాట్లాడామని అలాంటి మమ్ములను కుక్కలు మొరుగుతున్నాయి అంటూ విశ్వాసానికి మారు పేరైన కుక్కలతో పోల్చడం సంతోషదాయకమే గానీ మీలాంటి చెల్లెళ్లతో పోల్చకపోవడం అత్యంత సంతోషదాయకమని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి పిసిసి చీఫ్ షర్మిలమ్మ పై ఫైర్ అయ్యారు. దువ్వూరు మండలం,గుడిపాడు గ్రామంలోని దువ్వూరు సింగల్ విండో మాజీ చైర్మన్ తుమ్మల మస్తాన్ రెడ్డి స్వగృహంలో మంగళవారం రెడ్యనీ విలేకరులతో మాట్లాడుతూ పిసిసి చీఫ్ షర్మిలమ్మ విజయవాడలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నిస్సిగ్గుగా అబద్దాలను నీచ,నికృష్ట భాషతో మాట్లాడటం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు.తండ్రి చనిపోయినా ఆస్తి లో తన చెల్లెలు కి వాటా ఇచ్చే అన్నదమ్ములు ఉంటారని,తన సొంత ఆస్తిలో వాటా ఇచ్చే ఏకైక అన్న వైఎస్ జగన్ మాత్రమే కానీ... షర్మిలమ్మకు జగన్ సొంత వాటా ఇచ్చినా ధన దాహం... ఆస్తి దాహం తీర లేదని,షర్మిలమ్మ, ఆమెకు అండగా విజయమ్మ ఇష్టం వచ్చినట్లు గ్లోబెల్స్ మించి వైయస్ జగన్ పై విష ప్రచారం చేయడం,అబద్దాలను శత్రువులకు మించి మాట్లాడినా వారిపై మానవత్వం,ప్రేమ, అభిమానం ఉండబట్టే జగన్ వారికి జవాబు ఇవ్వడం లేదని, దమ్ము,ధైర్యం లేక కాదన్న నగ్న సత్యాన్ని గుర్తించి మసులుకోవాలని వారికి ఆయన వారికి హితవు పలికారు. మీరు వైయస్ జగన్ పైనే కాకుండా... వాస్తవాలు మాట్లాడే మాలాంటి వారిని సైతాన్ తో పోల్చడం సిగ్గుచేటని మేము సైతాన్ సైన్యం కాదని,జగనన్న సైన్యం కాబట్టే వాస్తవాలను నిర్భయంగా, నీతి,నిజాయితీ తో మాట్లాడుతున్నామని ఆయన పేర్కొన్నారు. వివేక హత్యపై జగన్, వైయస్ భారతి లు నిజం ఏమిటో చెప్పాలని షర్మిలమ్మ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని,దీనిపై నిజమేమిటో డా।। నర్రెడ్డి సునీతమ్మ ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి లు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. నలుగురు మనమల్లు, మనమరాల్లకు ఆస్తిని సమానంగా పంచాలని డా।।వైయస్ రాజశేఖర్ రెడ్డి చెప్పినట్లు విజయమ్మ దేవుడు సాక్షిగా ప్రస్తావించారని షర్మిలమ్మ వెలువరించడం దుర్మార్గమని,ఆ వాటా వైయస్ఆర్ ఉన్నప్పుడే పంచారని...షర్మిలమ్మ బ్లాక్ మెయిల్ తోనే విజయమ్మ లాంటి గొప్ప మహిళలతో



అబద్ధాలు ఆడిస్తోందని ఆయన నిశితంగా విమర్శించారు. వివేక మరణం పై సాక్షి చానల్లో గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేశారని వదే వదే చెప్పే సునీతమ్మ,షర్మిలమ్మ లు ఆనాడు ఏబిఎన్ లో తన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూసిన వైయస్ వివేకా అని,ఈటీవీలో వైయస్ జగన్ చిన్నాన్న వైయస్ వివేకనంద రెడ్డి హఠాన్మరణం అంటూ చేసిన ప్రచారాలపై ఎందుకు నిలదీయరని? ఎందుకు ప్రశ్నించరని? ఆయన సూటిగా ప్రశ్నించారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి ,ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యుడు,వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలపై షర్మిలమ్మ జవాబు ఇవ్వలేక అసందర్భం ప్రేలాపనలు, అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుపడ్డారు.నందమూరి బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిపినా,నారా రామమూర్తి నాయుడు తన అన్న చంద్రబాబు నాయుడు పై పోటీకి సై అన్నా,ఎన్టీఆర్ పై కుటుంబ సభ్యులంతా తిరుగుబాటు చేసినా... చెప్పులు వేయించినా,నందమూరి హరికృష్ణ సొంత పార్టీ పెట్టినా, ఎన్టీఆర్ కుమార్తె ఆత్మహత్య చేసుకుని మరణించినా అవి వారి సొంత సమస్యలని నాడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గానీ,నేడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గానీ ఏనాడు నోరు మెదపలేదని నేడు జగన్ కుటుంబం ఆస్తి గొడవల్లో ఎల్లో మీడియా ఛానల్లు కూటమినేతల ప్రమేయంతో తలదూరుస్తూ,విషం చిమ్ముతున్నారని వారి కుటుంబ సమస్యలు వారు వారు తేల్చుకుంటారని మధ్యలో మీకెందుకని ఆయన నిలదీశారు.ఏనాటికైనా వాస్తవాలు బయట పడతాయని...నిజం నిప్పు లాంటిదని ఆయన పేర్కొంటూ వైయస్ జగన్ ఎప్పటికైనా కడిగిన ముత్యంలా ప్రజల గుర్తిస్తారని... జగన్ విజయాన్ని ఎవరు ఆపలేరని.. సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత వాస్తవమో తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావడం అంతే వాస్తవం అని రెడ్యనీ విశదీకరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్సిపి నేతలు గుడిపాడు సర్పంచ్ రాజుపాలెం మాబు షరీఫ్, కమ్మర సుబ్బనాచారి, ఎర్రగుంట్ల నాగమోహన్ రెడ్డి, ఇచ్చు కత్తుల మహమ్మద్ గౌస్ లు పాల్గొన్నారు.

# సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్.డీ



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, మార్చి 25:హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాస-ఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాస-ఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు.స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు.డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తిపరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.

# రైతన్న మీకోసం....

ప్రకాశం దొనకొండ మండలంలోని "రైతన్న మీకోసం కార్యక్రమం" అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో టీం సభ్యులు అయినటువంటి పశుసంవర్ధక సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి,ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, పిఎసిఎస్, మార్కెటింగ్ అధికారులు, నీటి సంఘం సభ్యులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరందరూ ప్రతి రైతు కుటుంబాన్ని కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని అందించి రానున్న 5 సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు 5 విధానాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా దొనకొండ మండల వ్యవసాయ అధికారి వి. బాలకృష్ణ నాయక్ ఆరవల్లిపాడు, వద్దిపాడు, పడమటి వెంకటాపురం గ్రామాలలో జరుగుతున్నటువంటి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతన్న మీకోసం 6 రోజుల వారోత్సవాలలో (16-03-2026 నుండి 18-03-2026 వరకు మరియు 23-03-2026 నుండి 25-03-2026 వరకు) భాగంగా జరగబోవు రైతన్న మీకోసం రైతు కుటుంబాల సర్వేని గ్రామ వ్యవసాయ సహాయకులు సమర్థవంతంగా నిర్వహించి, ఈ కార్యక్రమం యొక్క 5 విధానాల కార్యాచరణ అయినటువంటి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి రైతన్నకు పెట్టుబడి సాయం తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి తగ్గించి అధిక లాభం పొందే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించాలని తెలియజేశారు. పాడి రైతులకు కూడా సాంకేతిక సలహాలు అందించి వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉన్నటువంటి గ్రామ వ్యవసాయ సహాయకులు " ఏపీ ఎయిమ్స్" యాప్ వలన కలిగే ప్రయోజనాలను గురించి మరియు క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు గురించి రైతులకు వివరించాలని, ఇంకా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోకుండా మిగిలి ఉన్న రైతులను గుర్తించి పూర్తిచేయాలని తెలిపారు.

# దేవరలో అపశృతి

సి. బెలగల్ మార్చి 24

మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామంలో శ్రీ సుంకుల పరమేశ్వరి దేవరలో అపశృతి జరిగింది. గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న వేళ్ల మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గ్రామానికి చెందిన కురువ శివ 28 సం, గుండెపోటుకు గురై అకస్మికంగా మృతి చెందారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కురువ గువ్వల ఈరన్న, నాగమ్మల మూడవ సంతానం శివ. మృతునికి 8 సంవత్సరాల క్రితం కోసిగి మండలం సాతనూరు గ్రామానికి చెందిన మల్లేశ్వరి తో వివాహం జరిగింది. మృతుడు మంగళవారం గ్రామంలో జరుగుతున్న సుంకుల పరమేశ్వరి దేవర లో పాల్గొని సాయంత్రం బంధువుల సమక్షంలో మంచి చెడులు మాట్లాడు కొనిచుండగా అకస్మాత్తుగా ఒక్కసారి గుండెపోటుకు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతునికి భార్యతోపాటు ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు. దీంతో గ్రామంలో జరుగుతున్న దేవరలో వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలో అలముకున్నాయి.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపండి:

## జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

వై ఎస్ ఆర్ కడప,మార్చి 25(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు అధికారులు వారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు.

కలెక్టరేట్ లోని సభాభవన్ సమావేశపు మందిరం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ

అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో అర్జీలు సమర్పించడంజరుగుతుందని వారికి నాణ్యమైన,సంతృప్తి స్థాయి లో పరిష్కారం చూపే విషయంలో అధికారులు శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని,ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగాపరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.జిల్లా అధికారులు వారికి అందిన అర్జీల పరిష్కారానికి సమయం కేటాయించి సమీక్షా చేయాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు

1) పెద్దనపాడు, ఎర్రగుంట్ల మండలానికి చెందిన గంజికుంట వెంకటేష్ గారు తమ భూమికి సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

2) ప్రొద్దుటూరు మండలానికి చెందిన కృష్ణమూర్తి గారు తమ ఇంటి పక్కన ఉన్నవారు మురుగు నీరు పోకుండా అడ్డుకట్ట వేసిన సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు.

3) కడప జిల్లాకు చెందిన కె. అంజలి గారు తమ కూతురికి గురుకుల పాఠశాలలో సీటు కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఓబులమ్మ,కో- ఆపరేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నేల పరిరక్షణ -- నీటి సంరక్షణలో హాఫ్ మూన్ మోడల్ కీలకం

కడప, మార్చి 25(భారత శక్తి) : మైదుకూరు మండలం, నీలాపురం గ్రామం రైతు సాధికార సంస్థ (క్సూ) ఆధ్వర్యంలో కడప జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో



నీలావురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణ రెడ్డి పొలంలో 'హాఫ్ మూన్ మోడల్' పై ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముందు మోడల్ మేకర్స్ అందరూ అనంతపురంలో చీఫ్ టెక్నికల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ వద్ద హాఫ్ మూన్ మోడల్ పై ప్రత్యేక శిక్షణ పొందారు. అదే శిక్షణను జిల్లాలోని అన్ని డివిజన్లకు విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతి డివిజన్‌లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

ముఖ్యంగా ఈ హాఫ్ మూన్ మోడల్ ద్వారా నీటి సంరక్షణ, నేల కోత తగ్గింపు, మరియు పంట దిగుబడి పెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. వర్షాధార మరియు వాలు (స్లోపీ) భూముల్లో ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు

అదేవిధంగా విత్తనాలను గులికల రూపంలో తయారు చేసి వినియోగించడం ద్వారా మొలకెత్తే శాతం పెరగడంతో పాటు పంట స్థిరత్వం మరింత మెరుగుపడుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు మరియు కేడర్ సభ్యులు పాల్గొని ప్రత్యక్షంగా శిక్షణను పొందారు.

# ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట,మార్చి 25(భారత శక్తి):ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు.

ఆలయంలో మార్చి 27 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సంప్రదాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని సన్నిధులు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు,



పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా డి.సి.సి.బి మహాజనసభ

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి25:

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, బ్యాంకు బాధ్యతల ఇన్‌చార్జ్ చాహత్ బాజ్ ఫాయ్ అధ్యక్షతన మహాజనసభ ఘనంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు పరిపాలన నివేదికను, 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను మహాజనసభ ముందుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందినట్లు వెల్లడించారు.

బ్యాంకు డిపాజిట్ సేకరణ, రుణవితరణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ, లాభాల దిశగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. రైతులకు,



సహకార సంఘాలకు సమయానికి రుణాలు అందజేసి వ్యవసాయ అభివృద్ధికి బ్యాంకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం కింద నాబార్డ్ సహకారంతో నాలుగు సహకార సంఘాలకు డ్రోన్లు, జనౌషధి కేంద్రాల స్థాపనకు తక్కువ వడ్డీపై రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇదే మార్గంలో ఇతర సంఘాలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుకు రావాలని సూచించారు.

ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ చంద్రశేఖర్, రవి, మాట్లాడుతూ, పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి రైతులకు మెరుగైన సేవలు అందించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాలను అన్ని సంఘాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా సహకార అధికారులు మాట్లాడుతూ, సహకార సంఘాల అభివృద్ధి కోసం బ్యాంకులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారులు సంజీవరెడ్డి, నీరజ, వాల్య నాయక్, కోదండ రాములు, వరలక్ష్మి, రామ్మోహన్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు, తోటపంటల శాఖ, మత్స్యశాఖ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి వజీర్ సుల్తాన్, ప్రధాన మేనేజర్ ఉషశ్రీ, ఉప ప్రధాన మేనేజర్ అశోక్, బ్యాంకు ప్రత్యేక విధుల అధికారి విజయ కుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పై నిర్వహించిన ముందస్తు మాక్ డ్రిల్ ను పర్యవేక్షించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 25: కామారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువులో బుధవారం ముందస్తు వరద సహాయక చర్యలపై సమగ్ర మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్ డి ఆర్ ఎఫ్) సమన్వయంతో, జిల్లా విపత్తు నిర్వహణ



అథారిటీ (డిడిఎమ్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం వరద పరిస్థితుల్లో రక్షణ చర్యలు, శాఖల మధ్య సమన్వయం, స్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా , మాక్ డ్రిల్ లో వరదలో చిక్కుకున్న బాధితులను రక్షించే విధానాలను ప్రదర్శిస్తూ రెస్క్యూ బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్ల సహాయంతో రక్షణ వంటి పద్ధతులను చూపించారు. మొత్తం 12 శాఖలు---అగ్నిమాపక, పోలీస్, వైద్య, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర విభాగాలు---చురుకుగా పాల్గొన్నాయి. మొత్తం 187 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సమయంలో సమన్వయం, తక్షణ స్పందన, ప్రజల అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. మాక్ డ్రిల్ ద్వారా ప్రజల రక్షణపై అవగాహనప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఎలా సురక్షితంగా రక్షించాలో తెలియజేయడానికి నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ డి ఆర్ ఎఫ్) బృందాల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని మాక్ డ్రిల్‌ల ద్వారా ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ముఖ్యమని తెలిపారు. విపత్తు సంభవించినప్పుడు భయపడకుండా, సరైన చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం తగ్గించవచ్చని ఆయన అన్నారు.

మాక్ డ్రిల్ ద్వారా కలిగిన అవగాహన, ప్రమాద సమయంలో వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలే విధానం వరదలు, తుఫానుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చిక్కుకుపోయిన వారిని రక్షించే పద్ధతులుఅత్యవసర సేవలను ఎలా సంప్రదించాలి అనే సమాచారం గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించే విధానం తదితర వాటిపై అవగాహన, ఇటువంటి మాక్ డ్రిల్‌లు ప్రజలకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించి, విపత్తుల సమయంలో సమర్థంగా స్పందించే సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.

ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, అధికారుల సూచనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను, ఆస్తులను రక్షించుకోవచ్చని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ రక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఇటువంటి మాక్ డ్రిల్‌ల ద్వారా ప్రజలకు , అధికారులకు విపత్తు సమయంలో ఎలా స్పందించాలో స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు.అలాగే నేషనల్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ డి ఆర్ ఎఫ్) బృందాలు వేగవంతంగా స్పందించి ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, విపత్తుల సమయం లో ఎలా ఎదుర్కోవాలో ముందుగానే అవగాహన కలిగివుండి అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఈ మాక్ డ్రిల్ లో అదనపు కలెక్టర్ విక్టర్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, డిప్యూటీ కమాండర్ డోల్ సింగ్, ఎన్ డి ఆర్ బృందం, జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్, ఆర్డీఓ వీణ , తహసిల్దార్ హిమబిందు వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి25:

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్నామని జన శిక్షణ సంస్థ చైర్మన్ ఆర్ ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్లో జరిగిన జన శిక్షణ సంస్థాన్ వరంగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళ పారిశ్రామిక ఉత్పత్తి ఎగ్జిబిషన్ కార్యక్రమానికి




ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ మా ద్వారా శిక్షణ పొంది తమ సొంతంగా కుటుంబం పోషించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ శిక్షణ శిబిరం 85% మందికి మహిళలకే ఇస్తామని, మేము ఇచ్చిన శిక్షణలో ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందుచున్నారని, ఈ శిక్షణ పూర్తిగా ఉచితంగా ఉంటుందని అన్నారు. ఈ వేడుకలకు 650 మంది హాజరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ టి శ్రీనివాస్ రఘు, స్టేట్ నోడల్ ఆఫీసర్ సతీష్ రెడ్డి, బోర్డు సభ్యులు గౌడ రమాదేవి, పాము జ్యోతి,కొలిపాక రాణి, నరసింహమూర్తి,హరిప్రసాద్, అన్వేష్,మధు, శ్రీనివాస్ రెడ్డి, సుదీర్ బాబు,హవేలీ రాజు, ఐలయ్య, చందర్, డైరెక్టర్స్, స్టాఫ్, ఆర్పీలు,తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే అత్యుత్తమ మోడల్ గా స్మార్ట్ కిచెన్ వ్యవస్థ

## -న్యూఢిల్లీలో "నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ సమ్మిట్ 2026" లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, మార్చి 25(భారత శక్తి) : వైఎస్ఆర్ కడప జిల్లాలో వినూత్నంగా చేపట్టిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ విధానం ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల సంక్షేమానికి ఒక మైలురాయిగా నిలుస్తోందని స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రానికే కాక దేశంలోనే ఒక ఉత్తమ నమూనాగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సగర్వంగా తెలిపారు.

న్యూఢిల్లీ ప్రగతి విహార్ లోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్ లో ఈ నెల 23,24 వ తేదీలలో రెండు రోజుల పాటు"నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ సమ్మిట్ 2026" నిర్వహించగా సమ్మిట్ లో మంగళ వారం 2వ రోజు కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా లో వినూత్నంగా అమలవుతున్న స్మార్ట్ కిచెన్ ప్రాజెక్ట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

స్మార్ట్ కిచెన్లతో వైఎస్ఆర్ కడప జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం -- విద్యార్థుల ఆరోగ్యం మరియు విద్యార్థుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అమలు చేస్తున్న ఈ మధ్యాహ్న భోజన పథకం నకు సాంకేతికత సహాయంతో కొత్త దశను చేరుకుంది. స్మార్ట్ కిచెన్ల వినియోగం ద్వారా ఈ పథకం అమలు విధానం పారదర్శకంగా, సమర్థవంతం గా మారి,విద్యార్థుల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొస్తోందన్నారు.




జిల్లాలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లలో పెద్ద మొత్తంలో మధ్యాహ్న భోజన తయారీకి అనుకూలంగా స్మార్ట్ కిచెన్ ని రూపొందించడం జరిగిందన్నారు.అందులో భాగంగా జూతీవంంబతీఅంవ౨ రైస్ , కుకింగ్ మరియు బల్క్ కుకింగ్ యూనిట్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. స్టీమ్ ఆధారిత వంట విధానాన్ని అవలంభించడం ద్వారా పోషక విలువలను కాపాడేందుకు దోహదం చేస్తుందన్నారు.

అత్యధిక నాణ్యత ప్రమాణాల ప్రకారం పదార్థాల నిల్వ (ఎశీశ్రీ౨ రశీతీఞ్రవ ఝఎఅశ్రీఖఅవం), పూర్తి గా శుభ్రతను పాటించే కిచెన్ పరిసరాలు (×ూా ప్రమాణాలకు సమానం) లను వినియోగించడం ద్వారా చిన్నపాటి మానవ తప్పిదాలు కూడా తగ్గి,ప్రతి రోజు ఒకే స్థాయి నాణ్యతతో భోజనం తయారు చేయడం జరుగుతోందన్నారు.

స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం అందడమే కాకుండా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించ గలుగుతున్నామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి కిచెన్ కార్యకలాపాల్లో భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధి కి కూడా దోహదం జరుగుతోందన్నారు.

ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ అమలు ను పర్యవేక్షించేందుకు ఆధునిక డిజిటల్ వ్యవస్థలు అమలు చేస్తున్నామని, ఃూా ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలు, కిచెన్ కార్యకలాపాలు మానిటరింగ్ చేయడం వల్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచ గలుగుతున్నామన్నారు.

2025 సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ గారి చేతుల మీదుగా ప్రారంభించబడిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ప్రస్తుతం జిల్లాలోని నాలుగు మండలాల్లో 5 స్మార్ట్ కిచెన్లు, 13 వాహనాల ద్వారా 133 పాఠశాలల్లో 10,512 మంది విద్యార్థులకు మధ్యాహ్న బడి భోజనాన్ని సరఫరా చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ కిచన్ల ద్వారా ఇప్పటివరకు 9,33,232 భోజనాలను విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు.

జిల్లా వ్యాప్తంగా 33 మండలాలలో స్మార్ట్ కిచెన్ విధానం ను అమలు చేసేందుకు నిర్మాణ పనులు త్వరితగతిన జరుగు తున్నాయని,మరో మాసంలో పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులు 100% సంతృప్తిని వ్యక్తం చేయగా వైఎస్ఆర్ కడప జిల్లాలో విజయవంతంగా అమలు అవుతున్న ఈ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని మరింత విస్తరించేందుకు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడామొగ్గుచూపుతున్నాయన్నారు.

జిల్లా యంత్రాంగం సంకల్పానికి సాంకేతికత, ప్రభుత్వ సహకారం, సమర్థవంతమైన అమలు మొదలైన మూడింటి కలయికతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం నిర్వహణ ఒక విజయగాథగా నిలిచిందన్నారు.ఇది కేవలం భోజన పథకం మాత్రమే కాదని,ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ వివరించారు.

# ఒంటిమిట్టలో భక్తి వాతావరణంలో హరిద్రా ఘటనం

## శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి శుభారంభం

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం



పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ప్రాధాన్యం :

హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు.

కార్యక్రమం విధానం :

ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు.

పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి ఎ. ప్రశాంతి, డీఈ (ఎలక్ట్రికల్) శ్రీమతి సరస్వతి, పీఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మాం

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చ్ 25: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి విచ్చేసే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను టీటీడీ జేఈవో వి. వీరబ్రహ్మాం, జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణలతో



కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా టీటీడీ మరియు జిల్లా అధికారులు బుధవారం ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామివారి ఆలయం, కళ్యాణ వేదిక వద్ద ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు.

ఇందులో భాగంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రయల్ రన్, సిఎం విడిది చేయనున్న టీటీడీ అతిథి గృహం, ఆలయ దర్శనం, వేద ఆశీర్వచనం తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే కళ్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, గ్యాలరీలు, భక్తులకు అందించనున్న అన్నప్రసాదం కౌంటర్లను కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జేఈవో మాట్లాడుతూ, శ్రీరామనవమి సందర్భంగా 50 నుండి 60 వేల మంది భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులందరికీ రుచికరమైన అన్నప్రసాదం అందించాలని, పానకం, వడపప్పు తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఆలయంలో ఎండ వేడిమి నుండి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు నిరంతరం నీటిని పిచికారి చేయాలని సూచించారు. అలాగే కళ్యాణ వేదికకు విచ్చేసే ప్రతి భక్తునికి వాటర్ బాటిళ్లు అందించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ సుమారు 3000 మంది పోలీసులతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు పార్కింగ్ విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో సీఈ టి.వి. సత్యనారాయణ, ఎస్ఈ మనోహరం, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు శ్రీమతి ఎ. ప్రశాంతి, ఎ. శివప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ ల విజిట్

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి యామిని సూచనల మేరకు

సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ సూపరింటెండెంట్లు , ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.




# -భూగర్భ జలాల వినియోగం నిర్వహణపై అవగాహన సదస్సు

మణుగూరు మార్చి 25 (భారతశక్తి):

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సంచాలకులు భూగర్భ జల శాఖ హైదరాబాద్ వారి సూచన మేరకు జిల్లా భూగర్భ జల శాఖ భద్రాద్రి కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎన్జీవో వారి సౌజన్యంతో గురువారం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మణుగూరు నందు విద్యార్థులకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.




ఈ సంధర్భంగా జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ నీటితో మహిళలకు ఉన్న అభినవభావ సంబంధాన్ని వివరిస్తూ నీటి వినియోగం, పొదుపులో మహిళల పాత్ర కీలకమని తెలిపారు. ఎక్కడైతే నీరు సమృద్ధిగా ఉంటుందో అక్కడ లింగ వివక్షత ఉండదని తెలిపారు. ఆహారము బాలికల విద్య భద్రత లో జరిగే అసమానతల గురించి వివరించారు. వాతావరణ మార్పులు భూతాపం వల్ల వర్షపాతం ఎక్కువ తీవ్రతతో కురుస్తుందని ఆ నీటిని సంరక్షణ పద్ధతులు, నిర్మాణాలు చేపట్టి భూగర్భ జలాలను ఇంకింప చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారిని, మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనినా మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం నీరు, లింగ వివక్షత అనే నినాదంతో ఈ సంవత్సరం మొదలైందని తెలిపారు. మహిళలు, ఆడపిల్లలు పాత్ర గురించి తెలియజేస్తూ ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన నీటిని తీసుకోవాలని దానికోసం అవలంబించాల్సిన పద్ధతుల గురించి విద్యార్థులకి వివరించారు. నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంతలకు నీటిని మళ్లించి వాటిని భూగర్భంలోకి ఇంకేం పని చేయాలని తెలిపారు. వ్యవసాయ సహాయక అధికారి తాతారావు మాట్లాడుతూ సహజ వనరుల్లో అతి ముఖ్యమైనది నీరు అని జీవకోటికి నీరు ప్రాణాధారమైనదని పొదుపుగా వినియోగించాలని దీనికి వేరే ప్రత్యామ్నయం లేదని తెలిపారు. భూమి మీద లభ్యమయ్యే జల వనరులలో 97% పైగా సముద్ర జలం, 2.8% శుద్ధ జలం దీనిలో కూడా 2.2 ఉపరితల జలం గాను 0.6% భూగర్భజలం గాను లభిస్తుందన్నారు. దీనిలో కేవలం 0.25 శాతం మాత్రమే వినియోగంలోకి తీసుకురాగలమని తెలిపారు. ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థ అవసరమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. రీఛార్జ్ గుంతలు సేద్యపు గుంతలు కందకాలు నిర్మించుకోవాలన్నారు. రోడ్డుపై పడిన వర్షపుని రీఛార్జ్ గుంటల ద్వారా ఇంకింప చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ భూమిలో దున్నే సమయంలో వాలుకి అడ్డంగా దున్నడం వల్ల వర్షపు నీరు వృధా పోకుండా అక్కడే భూగర్భంలోకి ఇంకుతుందని తెలిపారు. అలాగే ఇతర మండల అధికారులు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకై తమ వంతు బాధ్యతగా తమ కుటుంబంలో అందరికీ అవగాహన కల్పించాలని పిల్లల్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో తక్కువ నీటిని ఉపయోగించి బిందు సేద్యంతో వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలిచిన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి, సిఐ నాగబాబు, ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ గౌరీ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ కే మహాలక్ష్మి, ముత్యాలమ్మ నగర్ సెక్రటరీ సాయి, కృష్ణ సర్పంచ్ భూగర్భ జల శాఖ బాధ్యులు తిరుపతి ,వెంకటేశ్వర్లు ,శేషాద్రి, ఎయిడ్ ఎన్జీవో సంస్థ కోఆర్డినేటర్ రాజేష్, సోషల్ వర్కర్స్ మోహన్, మాన్సింగ్, జ్యోతి, మౌనిక పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

# నటి, మోడల్ హర్షిల్ కాలియా దుర్మరణం



ప్రముఖ నటి, మోడల్ హర్షిల్ కాలియా (30) సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో జైపూర్‌లోని షిప్రా పత్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ఆమె నడుపుతున్న కారు ఒక మలుపు వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కి బోల్తా పడింది. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, కారును సరిచేసి హర్షిల్‌ను బయటకు తీశారు. వెంటనే ఆమెను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? లేక మరో వాహనం ఏదైనా ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హర్షిల్ కాలియా 'క్రైమ్ నెక్స్ట్ డోర్' అనే వెబ్ సిరీస్‌తో పాటు పలు రాజస్థానీ మ్యూజిక్ వీడియోలలో నటించి గుర్తింపు పొందారు. గతంలో ఒక న్యూస్ ఛానెల్‌లో యాంకర్‌గా కూడా పనిచేశారు. ఆమె తండ్రి కూడా ఒక వార్తాపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు సమాచారం.

# దుల్కర్ సల్మాన్ గురించి

## ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన శృతి హాసన్



వెండితెరపై స్టార్ కిడ్స్‌గా అడుగుపెట్టిన శృతి హాసన్, దుల్కర్ సల్మాన్ తమకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. మరోవైపు, వీరి మధ్య చిన్నప్పటి నుంచే ఒక వింతైన స్నేహం ఉందన్న విషయం తాజాగా బయటపడింది. వీరిద్దరూ చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి... దుల్కర్‌తో తనకున్న స్పెషల్ మెమొరీస్‌ను పంచుకున్నారు. తామిద్దరూ చెన్నైలోని రెండు వేర్వేరు ప్రముఖ పాఠశాలల్లో క్లాస్‌మేట్స్‌గా ఉన్నామని, స్టార్ కిడ్స్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సాధారణంగా పెరిగామని శృతి చెప్పుకొచ్చారు. స్కూల్లో ఉన్నప్పుడు దుల్కర్ తనను 'సోంబి' అని పిలిచి ఆటపట్టించేవాడట. దానికి కారణం.. అప్పట్లో స్కూల్ ఫంక్షన్‌లో శృతి 'సోంబి' అనే పాటను పాడటమే. ఆ పాట విన్నప్పటి నుంచి దుల్కర్‌కు ఆమె పేరు 'సోంబి' అయిపోయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్కూల్లో ఉన్న చాలామంది పిల్లలకు ఆమె పేరు శృతి అని కూడా తెలియదట. కేవలం 'కమల్ హాసన్ కూతురు' అని మాత్రమే గుర్తుంచుకునేవారని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌గా అల్లరి చేసిన ఈ ఇద్దరూ, ఇప్పుడు పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో కలిసి నటించబోతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దుల్కర్ సల్మాన్ సరసన శృతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

## కొత్త కబురు వినిపిస్తారా?

గతేడాది 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రామ్‌పోతినేని. ఆ తర్వాత మళ్లీ ఇంతవరకు కొత్త కబురేమీ వినిపించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై స్పష్టత వస్తున్నట్లు తెలుస్తోంది. రామ్ ఈసారి ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు సమాచారం. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ శిష్యుడు లోగి విఘ్నేశ్ దీనికి దర్శకత్వం వహించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్ చర్చలు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయని.. నిర్మాణ సంస్థపై స్పష్టత రాగానే దీన్ని అధికారికంగా ప్రకటించనున్నారని వార్తలొస్తున్నాయి.

# 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'.. ఆ రోల్ మిస్ అయిన రాజశేఖర్



టాలీవుడ్ మల్టీస్టారర్ సినిమాల్లో ఎవర్‌గ్రీన్ 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. పెద్దోడు చిన్నోడుగా వెంకటేశ్ మహేశ్‌బాబు ఎంతగా అలరించారో.. వాళ్ల తండ్రి పాత్రలో ప్రకాశ్‌రాజ్ అంతగా ఆకట్టుకున్నారు. ఏం జరిగినా అంతా మనమంచికే అన్నట్లు వ్యవహరించే ఈ రేలంగి మామయ్య పాత్ర కోసం ముందుగా రాజశేఖర్‌ను అనుకున్నారు మేకర్స్. కానీ, అనివార్య కారణాల వల్ల ఆయన నటించలేకపోయారు. స్వయంగా ఆయనే ఓ ఇంటర్వ్యూలో ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "సీతమ్మ వాకిట్లో..'లో ఎప్పుడూ నవ్వుతూ ఉండే క్యారెక్టర్ కోసం మేకర్స్ నన్ను సంప్రదించారు. నా నవ్వు బాగుంటుందన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ రోల్ నేను చేస్తే బాగుంటుందని అడిగారు. కానీ చేయలేకపోయా'' అని తెలిపారు. నటించనందుకు ఎప్పుడైనా ఫీల్ అయ్యారా? అని అడగ్గా.. అలాంటిదేం లేదన్నారు. తనకు డ్యాన్స్ చేయడం ఇష్టం ఉండేది కాదని, అందుకే కెరీర్ ప్రారంభంలో కష్టపడాల్సి వచ్చేదని అన్నారు. అలా చేస్తూ ఉండగా కొన్నాళ్లకు డ్యాన్స్ అలవాటు అయిందని చెప్పారు. తనకు గోలీల ఫ్యాక్టరీ ఉందంటూ వచ్చిన రూమర్స్‌పై నవ్వుతూ స్పందించారు. "దాని ద్వారా నెలకు రూ.3 కోట్లు సంపాదిస్తున్నానట. ఎందరికో ఉపాధి కల్పిస్తున్నానని అన్నారు. ఇంతకీ అదెక్కడ ఉందో తెలిస్తే బాగుంటుంది. ఈ వార్తలు చూసిన ఎంతోమంది కాల్ చేసిన నిజంగానే మీకు గోలీల ఫ్యాక్టరీ ఉందా? అని అడిగారు'' అని చెప్పారు. ప్రస్తుతం 'బైకర్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారాయన. ఈ మూవీలో హీరో శర్వానంద్‌కు తండ్రిగా నటించారు. అభిలాష్‌రెడ్డి దర్శకత్వం వహించిన స్పోర్ట్స్ యాక్షన్ మూవీ ఇది. ఏప్రిల్ 3న విడుదల కానుంది.

# సినిమా

## చెర్రీకి గాయంతో

# షూటింగ్‌వాయిదా!



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న తాజా చిత్రం పెద్ది. వచ్చే నెల 30న విడుదల లక్ష్యంగా ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం దీని షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండగా.. మృణాల్ ఠాకూర్ ఓ స్పెషల్ పాటలో మెరవనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు కోట్ల వ్యూస్ తో సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టించాయి.రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు టాక్.అయితే ఈ సినిమా షూటింగ్ లో హీరో చెర్రీకి గాయమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన కంటి దగ్గర దెబ్బ తగిలినట్లు సమాచారం. అది చిన్న గాయమేనని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని సినీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో పెద్ద మూవీ షూటింగ్ కొన్ని రోజులు వాయిదా పడినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ప్రభాస్‌కు తల్లిగా

# నటించను

టాలీవుడ్‌లో ఒకప్పుడు సూపర్ హిట్ మూవీలతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశి. పెండ్లి తర్వాత కొన్నేళ్ల పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంది. మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన రాశి పలు చిత్రాలతో పాటు సీరియల్స్‌లో కూడా కనిపిస్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రెబెల్ స్టార్ ప్రభాస్ అంటే తనకు ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా నటించనని చెబుతోంది. 'ప్రభాస్‌తో కలిసి ఒక్క సినిమాలో అయినా నటించాలనే ఆశ చాలా ఏండ్లుగా ఉండిపోయింది. ప్రస్తుత పరిస్థితిల్లో చాన్స్ వచ్చినా తల్లిగా మాత్రం నటించను. ఆపై అక్క, వదిన వంటి పాత్రలు వచ్చినా చేయను. హీరోయిన్‌గా నటించే అవకాశం ఎలాగూ ఇవ్వరు. దీంతో నా కోరిక అలాగే ఉండిపోయింది. ఈశ్వర్ సినిమా ట్రైలర్ చూసినప్పుడే ప్రభాస్ పెద్ద హీరో అవుతాడని నా బ్రదర్ తో చెప్పా. ఆయన మూవీస్ చూడటానికి మాత్రమే థియేటర్ కు వెళ్తా. మిర్చి, రాధే శ్యామ్ సినిమాలకు డబ్బింగ్ చెప్పా. అడవి రాముడు షూటింగ్ సమయంలో ప్రభాస్ ఉన్న హోటల్‌లోనే నేను కూడా ఉన్న. ఆ విషయం తెలిసి నేను ఎగిరి గంతేశా. కానీ ఇప్పటివరకు ఆయన్ను కలవలేదు' అంటూ రాశి చెప్పుకొచ్చింది.



# తిరుపతి వెళ్లి పూజలు చేస్తారు

'దురంధర్: ది రివెంజ్' భారీ విజయం సౌత్,నార్త్ లో ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించారు. ఈ సినిమా రికార్డు స్థాయి వసూళ్లపై దక్షిణాది దర్శకులకు నచ్చదని, ఈ విజయాన్ని వాళ్లు ఇష్టపడరని అన్నారు.తమ సినిమాలు దురంధర్ రికార్డును బద్దలు కొట్టాలని తిరుపతి, వైష్ణో దేవి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లి పూజలు చేస్తారని అన్నారు. 'ప్రొపగాండా' ఆరోపణలపై స్పందిస్తూ ప్రతి ఒక్కరికీ తమదైన అభిప్రాయం ఉంటుందని వర్మ తెలిపారు. దర్శకుడు ఆదిత్య ధర్ తన పరిశోధన ఆధారంగా కథను రూపొందించాడని, ఎవరికైనా అభ్యంతరం ఉంటే వారు తమ కథను తాము తెరకెక్కించవచ్చని సూచించారు. దర్శకుడి సామర్థ్యం కథను నమ్మించేలా చూపడంలోనే ఉందని స్పష్టం చేశారు. దురంధర్ 2లో రణ్‌వీర్ సింగ్ హమ్జా అలీ మజారి పాత్రలో నటిస్తూ షేర్ ఎబలోచ్‌గా ఎదిగే కథను చూపించారు. పాకిస్థాన్‌లోకి గూఢచారిగా ప్రవేశించి ప్రతీకారం తీర్చుకునే కథాంశంతో సినిమా సాగుతుంది. ఇందులో అర్జున్ రాంపాల్, ఆర్ మాధవన్, సంజయ్ దత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.










# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం

* **మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభం**
* **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
* **తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్**

సిద్దిపేట,మార్చి 25 (భారత శక్తి) : కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా హెల్త్ క్యాంప్ ని పీ హెచ్ సి పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ పీహెచ్సిలో ప్రజపాలన కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, పాలకవర్గం సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి క్యాంపును ప్రారంభించారు. సర్పంచ్ స్వయంగా రక్త పరీక్షలు చేయించుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



అనంతరం వైద్య బృందం గ్రామస్తులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచితంగా మందులను పీహెచ్సి వైద్యధికారి దివ్య శ్రీ, పాలకవర్గం సభ్యులు, వైద్య సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ హెల్త్ క్యాంపు ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.అనంతరం పీహెచ్సి వైద్యధికారి దివ్య శ్రీ మాట్లాడుతూ మెగా హెల్త్ క్యాంప్ లో పెడియాట్రిక్స్, డెంటల్,జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్,ఆఫ్తాల్మాలజీ, ఓబీజీ, గైనకాలజీ విభాగాల్లో మొత్తం 250 మంది వైద్య పరీక్షలు చేశామన్నారు. ప్రజా ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, స్వామి, పద్మనాభునిపల్లి సర్పంచ్ వేముల అరుణ రాజేశం, తిమ్మాపూర్ ఉపసర్పంచ్లు వన్నెల విజయ్ కుమార్ , రుద్రారం యాదగిరి,వార్డ్ మెంబర్లు మండల కనకయ్య, మహిళలు, యువత పీహెచ్సి సిబ్బంది సిహెచ్ఓ అలకనంద, హెచ్ఈఓ లు రాజేందర్ కొండయ్య, ఎంఎన్వో యాదగిరి, ఎంపి హెచ్సి శ్యామల శోభ రాణి, ఫార్మసిస్ట్ నవీన్ హెల్త్ అసిస్టెంట్ గణేష్, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ఉన్నారు.



ఎవరికీ చెప్పకుండా కనపడకుండా వెళ్ళిపోయిన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తపోవన్ కాలనీ తిర్రి ప్రసాద్ (19)అనే పేరు గల యువకుడు. కనపడకుండా పోయిన ప్రసాద్ అన్న తిర్రి అనీల్ రెండు రోజులు బంధువుల దగ్గర చుట్టుపక్కల వెతికి,ఎంతకు ఆచూకీ దొరకక పోవడంతో సరూర్నగర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఎల్బీనగర్, మార్చి 25 (భారత శక్తి)




## మాకు రేటు పడతలేదు...
# అందుకే చికెన్ దుకాణాలు బంద్

ఎల్బీనగర్, మార్చి 25 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1 వ తారీకు నుండి చికెన్ షాపులను బంద్ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తెలిపినట్లు ఎల్బీనగర్, ఉప్పల్ పలుచోట్ల చికెన్ షాప్ వ్యాపారులు వారి వ్యాపార సమూదాయం ముందు షాపులు బంద్ చేస్తున్నట్లు పోస్టర్లను అంటించారు. చికెన్ అమ్మే వారికి మార్జిన్ ఇవ్వని పౌల్ట్రీ కంపెనీల దౌర్జన్యానికి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, లాభాలు లేక వ్యాపారం నడపడం కష్టంగా మారింది అన్నారు. తగ్గించిన మార్జిన్ ను సరి చేసే వరకు బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్లు తెలుపుతున్నారు.

# పెట్రోల్ డీజిల్ కొరతపై వదంతులు నమ్మకండి

**- దుబ్బాక సీఐ టి. రాజేష్**

సిద్దిపేట, మార్చి 25 (భారత శక్తి) : రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మవద్దని, ఆయిల్ సంస్థల దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయని దుబ్బాక సీఐ టి రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ కొరత ఎక్కడా లేదని, వాహనదారులు కంగారుపడి పెట్రోల్ బంకుల వద్దకు పరుగులు తీయవద్దని కోరారు.ఎవరైనా బంకు యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తూ, ప్రజలను



భయాందోళనలకు గురి చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

* **ప్రేమకు అడ్డుందని ఘాతుకం.. ఇంట్లోనే పాతిపెట్టి సిమెంటుతో పూడ్చివేత.**
* **జవహర్నగర్ హత్య కేసు మిస్టరీ వీడింది.. నిందితుడు మోంటీ, మైనర్ అరెస్ట్.**

జవహర్నగర్, మార్చి 25 (భారత శక్తి) : నవమాసాలు మోసి, కని పెంచిన కన్నతల్లి అని కూడా చూడకుండా.. ప్రేమించిన వాడి కోసం ఓ కుమార్తె చేసిన ఘాతుకం సమాజాన్ని నివ్వెరపరిచింది. తన ప్రేమకు అడ్డు పడుతోందని కన్నతల్లిని ప్రియుడితో కలిసి కత్తితో పొడిచి చంపి, ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే పాతిపెట్టిన అమానుష ఘటన జవహర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. బుధవారం మల్కాజిగిరి జోన్ డీసీపీ శ్రీధర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.

* **ప్రేమ చిచ్చు.. జైలుకు వెళ్లినా మారని వైనం**

పోలీసుల కథనం ప్రకారం.. కౌకూర్ భరత్నగర్కు చెందిన అంజు (40) వృత్తిరీత్యా పనిమనిషిగా పనిచేస్తోంది. ఆమె చిన్న కుమార్తె (17) ఇంటర్ చదువుతున్న సమయంలో బీహార్కు చెందిన డ్రైవర్ మోంటీ కుమార్ సింగ్తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. బాలిక మైనర్ కావడంతో గతంలో మోంటీపై రెండుసార్లు పోక్సో (POCSO) కేసులు నమోదయ్యాయి. జైలుకు వెళ్లి వచ్చినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. పైగా తల్లిపై ద్వేషం పెంచుకున్నారు.




# కన్నతల్లినే కడతేర్చిన కుమార్తె..!

* **బెడ్ కిందే సమాధి.. పక్కా స్కెచ్!**
* తల్లిని అడ్డు తొలగించుకోవాలని పథకం వేసిన నిందితులు.. గత ఏడాది మే 12న ఘాతుకానికి ఒడిగట్టారు.
* దాడి: ఇంట్లో నక్కి ఉన్న మోంటీ, బాలిక సంకేతం ఇవ్వగానే అంజుపై దాడి చేశాడు.
* హత్య: కుమార్తె తల్లిని గట్టిగా పట్టుకోగా, మోంటీ కత్తితో ఆమె గుండెల్లో పొడిచి ప్రాణాలు తీశాడు.
* సాక్ష్యాల మాయం: అనంతరం మృతదేహాన్ని బెడ్ కింద దాచి, రక్తం మరకలు తుడిచేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే గుంత తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టి, పైన సిమెంటు, ఇసుకతో పక్కాగా పూడ్చివేశారు.
* కట్టుకథ: ఎలుకల వల్ల నేల పాడైందని, అందుకే రిపేరు చేయించామని చుట్టుపక్కల వారిని నమ్మించారు.

**మిస్సింగ్ కేసుతో వెలుగులోకి..**

తల్లి కనిపించడం లేదంటూ పెద్ద కుమార్తె రోషిణి అక్టోబర్ 2025లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 'మహిళ అదృశ్యం' కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా అనుమానంతో మోంటీని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది. హత్య తర్వాత నిందితులిద్దరూ కలిసి జీవిస్తూ, ఈ ఏడాది జనవరిలో పెళ్లి కూడా చేసుకున్నారని, ప్రస్తుతం వారికి రెండు నెలల బాబు ఉన్నాడని పోలీసులు తెలిపారు.

**నిందితుల అరెస్ట్**

నిందితుడి ఒప్పుకోలుతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్మార్టం నిర్వహించారు. నిందితులు మోంటీ కుమార్ సింగ్ మరియు మైనర్ బాలికను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీస్ అధికారులను డీసీపీ అభినందించారు.

# ఎస్సీలతోనే రజకుల అభివృద్ధి: శాగంటి వెంకటేష్

* **ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలుచేయాలి: సాంబరాజు కుమార్**
* **ఉచిత విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలి పొలాస అశోక్**

జవహర్ నగర్ మార్చి 25.( భారత్ శక్తి )రజక కులస్తుల ఎస్సీ జాబితాలో చేర్చాలని చేస్తున్న సుదీర్ఘంగా పోరాటాలను గుర్తించిన నేటి సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి గారు రజకులను ఎస్సీలో చేర్చాలని 2016 అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఎందుకు నోరు విప్పడం లేదో తెలంగాణ రజక కులస్తులకు సమాధానం చెప్పాలని మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్ర మండలం అంబేద్కర్ నగర్ రజక మినీ పంక్షన్హాల్లో 2532026బుధవారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలిపాక



లక్ష్మణ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ మాట్లాడుతూ 2016 డిసెంబర్ 26న ఏనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జోడో పాదయాత్రలో దేశవ్యాప్తంగా ధోబీలను ఎస్సీ జాబితాలో చేర్చుతామని జోడో పాదయాత్రలో రాహుల్ గాంధీ అన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి పొలాస అశోక్ గత ప్రభుత్వం రజకులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసిన దానిని ఈ ప్రభుత్వం అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది కానీ పెండింగ్లో ఉన్న బిల్లులు తక్షణమే బడ్జెట్ కేటాయించి క్లియర్ చేయాలని కోరారు.కార్యక్రమంలో కాప్ర మండల ప్రధాన కార్యదర్శి సాంబరాజు బాల్ రాజ్,అంబేడ్కర్ నగర్ రజక సంఘం అధ్యక్షులు చి మరికొందరు యాదగిరి,చిట్యాల సత్తయ్య, ఇటిక్యాల సిద్ధాయ్య,సిహెచ్ ప్రభాకర్,నాగపురి కృష్ణ, సిహెచ్ మహేష్, అలుగునూరి శోభన్,సిహెచ్ క్రాంతి నరేష్, పాండు తదితరులు పాల్గొన్నారు




# భూబకాసురుల గుట్టురట్టు!

* **నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. ఏఎస్ఐ సహా తొమ్మిది మంది అరెస్ట్**
* **కీసర పోలీసుల మెరుపు దాడి..**
* **పక్కా ప్లాన్తో దొరికిన ముఠా**

కీసర, మార్చి 25 (భారతశక్తి) : అమాయకుల ఆస్తులపై కన్నేసి, నకిలీ పత్రాలతో చక్రం తిప్పాలని చూసిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు బుధవారం బట్టబయలు చేశారు. ఈ ముఠాలో రక్షక భటుడే భక్షకుడిగా మారి ఏఎస్ఐ (ASI) స్థాయి అధికారి కూడా ఉండటం గమనార్హం. మరణ ధృవీకరణ పత్రాల నుంచి వారసత్వ సర్టిఫికేట్ల వరకు అన్నింటినీ ఫోర్జరీ చేస్తూ, అసలు యజమానులకు చుక్కలు చూపిస్తున్న ఇద్దరు ప్రధాన నిందితులతో సహా మొత్తం తొమ్మిది మందిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు.

* **చనిపోయినట్లు నకిలీ సర్టిఫికేట్లు.. అసలు సీన్ ఇదీ!**

ఈ ముఠా ప్లాన్ వింటే ఎవరికైనా ముచ్చెమటలు పట్టాల్సిందే. వీరు మొదట ఖాళీగా ఉన్న ప్లాట్లను, యజమానులు అందుబాటులో లేని భూములను టార్గెట్ చేస్తారు.ముందుగా అసలు యజమానుల వివరాలు సేకరిస్తారు. వారు బతికుండగానే చనిపోయినట్లు నకిలీ 'డెత్ సర్టిఫికేట్లు' సృష్టిస్తారు. ఆ తర్వాత నకిలీ వారసులను పుట్టించి, వారి పేర్లతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్లు, సేల్ డీడ్లు తయారు చేస్తారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయించేవారు.

**ఫిర్యాదుతో కదిలిన డొంక..**

ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో కాజేస్తున్నారని పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా షాకింగ్ నిజాలు బయటపడ్డాయి.

**అరెస్టయిన వారు వీరే..**

రెండు వేర్వేరు కేసుల్లో (Cr. No. 241/2026, 248/2026) నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదటి కేసు: ఏఎస్ఐ కనకాటి లింగయ్య గౌడ్, ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీప. రెండో కేసు: ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్య. వీరి నుంచి ఫోర్జరీ చేసిన పత్రాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.




**అప్రమత్తంగా ఉండాలి: డీసీపీ**

"భూముల కొనుగోలు విషయంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలి" అని మల్కాజిగిరి డిసిపి శ్రీ చ. శ్రీధర్ సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని ఆయన అభినందించారు.ppja

# కాంట్రాక్టర్ కు లాభం.. ప్రజలకు శాపం

- రాజుల సొమ్ము.. రాళ్ళ పాలు.!
- ముందుది వెనుక.. వెనుకది ముందుగా నిర్మాణాలు
- గుత్తేదారుల చెప్పు చేతల్లో అధికారులు
- నాణ్యతకు తిలోదకాలు.! ఇష్టారాజ్యంగా నిర్మాణాలు.!
- సిసి రోడ్డుకు రూ. 4కోట్ల 90 లక్షలు, సైడ్ డ్రైన్లు 32 లక్షలు 50 వేలు మట్టిపాలేనా.?



మణుగూరు, మార్చి 25 (భారతశక్తి) : మున్సిపాలిటీ లోని ప్రజా ఆరోగ్య శాఖ అధికారుల లాలూచీతో కాంట్రాక్టర్ ఖజానాకు లాభాలు, ప్రజలకు శాపాలుగా మారింది. తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టియుఎఫ్ఐడిసి) నిధులు రూ. 32.50 లక్షలతో సైడ్ డ్రైనేజీలు, రూ.4కోట్ల 90 లక్షల నిధులతో పూల మార్కెట్ సెంటర్ లోని శివలింగాపురం వెళ్ళే వైపు లక్ష్మణ్ కిరాణా షాపు నుండి మున్సిపాలిటీ కార్యాలయం మీదుగా నాయుడు కుంట చెరువు వరకు సిసి రోడ్డు నిర్మాణానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 2025 మే నెలలో శంఖుస్థాపన చేశారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు హడావుడిగా నాణ్యతలు పాటించకుండా సైడ్ డ్రైన్లు, సిసి రహదారుల నిర్మాణం చేశారు. పది రోజులు గడవకముందే ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు పగులగొట్టే పనిలో పడ్డారు. సైడ్ డ్రైనలైతే నిర్మాణాలు చేస్తుంటేనే కూలిపోయాయి.

*** రాజుల సొమ్ము రాళ్ళ పాలు**

మున్సిపాలిటీ పరిధిలో చేసే అభివృద్ధి పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. ఎటువంటి అభివృద్ధి నిర్మాణాలైన నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండాలన్న ఉద్దేశంతో చేపడతారు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మున్సిపాలిటీ ఏరియాలో ఇటీవల చేపట్టిన సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీలు ఇందుకు భిన్నంగా కన్పిస్తున్నాయి. సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్లు ఇచ్చే బహుమతులకు లోపాయకారి తనంతో బిల్లులపై సంతకాలు చేసేస్తున్నారు. రాజుల సొమ్ము రాళ్ళ పాలు అన్నచందంగా ప్రభుత్వం సొమ్ము కాంట్రాక్టర్ ఖాతాలోకి పోతున్నాయి. చేసిన అభివృద్ధి పనులు ఇష్టారాజ్యంగా ముందుది వెనుక.. వెనుకది ముందుగా నిర్మాణాలు చేస్తున్నారు. తర్వాత చిన్న చిన్న లోపాలు ఉన్నాయంటూ మేజరుగా డ్యామేజ్ చేసి గుత్తేదారులకు లాభాలు చేకూరుస్తున్నారు.

***కుప్పకూలిన సైడ్ డ్రైన్లు**

మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం నుండి బాపనకుంట వరకు సల్లేజ్ డ్రైన్ నిర్మాణంలో కూడా నాణ్యత లోపించడంతో కుప్పకూలిపోయాయి. తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (టియుఎఫ్ఐడిసి) నుండి రూ.32.50 లక్షల వ్యయంతో సైడ్ డ్రైన్ నిర్మాణం చేశారు. శివలింగాపురం లోని రామాలయం ఎదురుగా సైడ్ డ్రైన్ నిర్మాణం చేసిన తర్వాత సెట్రింగ్ తొలగిస్తుండగా నిర్మాణం కూలిపోయింది. కూలిపోయిన వాటిని పూర్తిగా తొలగించకుండా పై పైన మెరుగులు దిద్ది మరల నిర్మాణం చేశారు. వాటిపై పగుళ్లు వచ్చి కాంట్రాక్టర్ల నాణ్యత, ఇంజనీర్ల పర్యవేక్షణను వెక్కిరిస్తున్నాయి. కాంట్రాక్టర్లు ఇచ్చే తాయిలాల కక్కుర్తితో డ్రైనేజీలు, సిసి రోడ్డు నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేస్తున్నారనే విమర్శలు వచ్చిపడుతున్నాయి. సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 4కోట్ల 90 లక్షలు, సైడ్ డ్రైన్లు నిర్మాణానికి వెచ్చించిన రూ. 32 లక్షలు 50 వేలు మట్టిపాలేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మన్నిక లేకుండా చేసిన నిర్మాణాలపై స్థానిక ప్రజా ప్రతినిధి, జిల్లా ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూద్దాం.







# బడంగ్పేట్ మున్సిపల్ ఆఫీస్ పక్కనే 'మురుగు' కంపు!

- **ఆరు నెలలుగా రాజీవ్ గృహకల్ప రోడ్లపైనే డ్రైనేజీ ప్రవాహం**
- **పట్టించుకోని బడంగ్పేట్ అధికారులు**
- **జనం పక్షాన పోరాడుతాం: రామిడి రాంరెడ్డి**

బడంగ్పేట్, మార్చి 25 (భారత శక్తి): బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరు 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్నట్లు కాకుండా, 'ఇల్లు తగలబడ్డాక బావులు తవ్వినట్లు' ఉంది. సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ప్రజలు మురుగు నరకాన్ని చూస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. రాజీవ్ గృహకల్ప సమీపంలో గత ఆరు నెలలుగా భూగర్భ డ్రైనేజీ పైపులు పగిలి మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీనిపై స్థానికులు మొరపెట్టుకుంటున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ నాయకుడు రామిడి రాంరెడ్డి మండిపడ్డారు.

**రోడ్డుపైనే 'మురుగు' చెరువు**

రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పైపులు పగిలి మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ఆ ప్రాంతం అంతా చెరువును తలపిస్తోంది. అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేక స్థానికులు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

**అధికారులు నిదుర మత్తు వీడాలి..**

సమస్య ఉన్న చోట క్షేత్రస్థాయిలో పర్యటించిన రామిడి రాంరెడ్డి అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా మురుగు పారుతున్నా, కార్పొరేషన్ అధికారులు నిదుర మత్తులో ఉండటం సిగ్గుచేటని విమర్శించారు. పాలకులకు, అధికారులకు ప్రజల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. తక్షణమే డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి, ప్రజలను ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# లేఅవుట్ మింగేసి.. పాస్‌బుక్ కొట్టేసి!

పటాన్‌చెరు, మార్చ్ 25 (భారత శక్తి) : అది 44 ఏళ్ల కిందట వెలిసిన నివాస లేఅవుట్. వెయ్యికి పైగా ప్లాట్లు.. వందలాది మంది బాధితులు. కానీ, ఇప్పుడు అక్కడ లేఅవుట్ మ్యాపులు లేవు.. ప్లాట్ల హద్దులు లేవు. రియల్ మాఫియా ప్లాన్ గీస్తే.. అక్కడ ప్లాట్లు మాయమై సాగు భూమి పుట్టుకొచ్చింది. ఏకంగా ధరణిలో రికార్డులు సృష్టించి పాస్‌బుక్కులు కూడా తెచ్చుకున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటిఘనాపూర్‌లోని 'ఆనందనగర్' లేఅవుట్ కబ్జా బాగోతంపై బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

*** రికార్డుల్లో సాగు భూమి.. గ్రౌండ్‌లో ప్లాట్లు!**

1980లో 92 ఎకరాల విస్తీర్ణంలో 1,109 ప్లాట్లతో గ్రామపంచాయతీ అనుమతితో ఆనందనగర్ లేఅవుట్ వెలిసింది. చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్ఎస్ (LRS) కూడా చేయించుకున్నారు. అయితే, కొందరు కబ్జాదారులు లేఅవుట్ హద్దులను చెరిపేసి, దాన్ని వ్యవసాయ భూమిగా చిత్రించారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని పాస్‌బుక్కులు సృష్టించి ప్లాట్లను ఆక్రమించుకున్నారని బాధితులు కమిషనర్ ముందు గోడు వెళ్లబోసుకున్నారు.

**రోడ్లు, పార్కులూ వదల్లేదు..**

లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కులు, విశాలమైన రహదారులను సైతం ఆక్రమించి విక్రయించినట్లు బాధితులు ఆధారాలతో సహా వివరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్లాట్ల యజమానులు తమకు జరిగిన అన్యాయాన్ని కమిషనర్‌కు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న లేఅవుట్‌ను సాగు భూమిగా మార్చడంపై రంగనాథ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



**రంగనాథ్ ఆదేశాలు ఇవే..**

పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కమిషనర్ రంగనాథ్ అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు:

అక్రమాలు తేల్చండి: పాత లేఅవుట్ మ్యాపుల ప్రకారం సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాలి.

- కబ్జాలు హటావో: లేఅవుట్ పరిధిలోని పార్కులు, రహదారుల్లో ఉన్న అక్రమ కట్టడాలను వెంటనే కూల్చేయాలి.
- కఠిన చర్యలు: ఫోర్జరీ రికార్డులు సృష్టించిన వారిపై, సహకరించిన అధికారులపై చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.
- దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాడుతున్న తమకు హైడ్రా రాకతోనైనా విముక్తి లభిస్తుందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఈనెల 30న అసెంబ్లీ ముట్టడిస్తాం : టీ.యూ.ఎఫ్

- **హామీలు అమలు చేయకుంటే సహించేది లేదు**
- **తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ హెచ్చరిక**




ఎల్బీనగర్, మార్చి 25 (భారత శక్తి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన 'అసెంబ్లీ ముట్టడి' చేపట్టనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రకటించింది. బుధవారం ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని రాష్ట్ర కార్యాలయంలో ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ జెనిగె విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

**మూడేళ్లుగా కమిటీ ఊసేలేదు..**

ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడుతున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని చెప్పి మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి చొరవ లేదని మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ ఈ ముట్టడికి తీర్మానం చేసినట్లు వెల్లడించారు.

*** పార్టీలకు అతీతంగా తరలిరావాలి:**

రాష్ట్రంలోని ఉద్యమకారులు పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఈనెల 30న జరిగే అసెంబ్లీ ముట్టడిలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

*** ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు**

రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కారింగుల నరేందర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు జానకి రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆడాల యాదయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు తండ ఉపేంద్ర యాదవ్, ఉపాధ్యక్షురాలు నౌసు ఇంద్ర, జిల్లా సెక్రెటరీ సంగిపేటి నరేష్ కుమార్, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి మాల కృష్ణ, జనరల్ సెక్రెటరీ రామ్ సాగర్, కిషోర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు.. కల సాకారం!

- **ప్రశాంతి హిల్స్‌లో గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులు**

మీర్పేట్, మార్చి 25 (భారత శక్తి): పదేళ్ల నిరీక్షణ తర్వాత పేదల సొంతింటి కల నెరవేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకంలో భాగంగా 58వ డివిజన్ ప్రశాంతి హిల్స్, 34వ వార్డుకు చెందిన ప్యాట కవిత బాలరాజ్ దంపతులకు ఇల్లు మంజూరైంది. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ ఇంటికి బుధవారం వారు గృహ ప్రవేశం చేశారు.

*** పూజా కార్యక్రమాల్లో నేతల భాగస్వామ్యం**

లబ్ధిదారుల ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారు కోఆప్షన్ సభ్యులు జెటవత్ రవినాయక్, వార్డు ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్లు టిట్ల కృష్ణ, ధరవత్ స్వామి నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వాగత్ శ్రీనివాస్, నక్క బాలకృష్ణ, తిరుపతయ్య, ఆలేటి నాని, లక్ష్మణాచారి, మైత్రి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ వేడుకకు హాజరైన పారిజాత నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 25 (భారతశక్తి) : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంగళ్‌పల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రాంరెడ్డి నూతన గృహప్రవేశ వేడుకకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన గృహాన్ని సందర్శించి యజమాని రాంరెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# రాజకీయాలను పక్కనపెట్టి.. భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

హైదరాబాద్, మార్చి 25(భారత శక్తి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. ఈరోజు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్ళీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
# 3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్

ఇజ్రాయెల్, మార్చి 25 : యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

# ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

అమరావతి, మార్చి 25(భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులుఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనుమతిలేదంటూ
# హర్మూజ్ దాటిన పాకిస్థాన్ నౌకను వెనక్కి రప్పించిన ఇరాన్

మార్చి 25 : హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి రప్పించుకుంది. పశ్చిమాసియాలోయుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ సరిహద్దుల్లోని హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం నిబంధనలు విధించింది. ఈ జలసంధి మీదుగా వెళ్లడానికి అనుమతులను తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో హర్మూజ్ మీదుగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ కరాచీ వెళుతోంది. అయితే అనుమతులు లేకుండా ప్రయాణించడంతో ఆ నౌకను వెనక్కి రప్పించినట్లు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ (ఐఆర్జీసీ) వెల్లడించింది. హర్మూజ్ గుండా వెళ్లే ప్రతి నౌక ఐఆర్జీసీ సముద్ర అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని ఇరాన్ స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌కు చెందిన నౌకను ఇరాన్ వెనక్కి రప్పించినట్లు కాబుల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధృవీకరించింది. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జా నుండి ఈ నౌక కరాచీకి వెళుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ జలసంధి గుండా తాము అనుమతించిన నౌకలు వెళ్లాలని చెబుతోంది.

## హైదరాబాద్‌లో వడగళ్ల వాన...
# రంగారెడ్డి జిల్లాకు రెడ్ అలర్ట్

హైదరాబాద్, మార్చి 25(భారత శక్తి) : హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. వనస్థలిపురం, హయత్ నగర్, గాయత్రీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఘట్‌కేసర్, అన్నోజిగూడ, నారపల్లిలో భారీ వర్షం కురుస్తోంది. రంగారెడ్డి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నారాయణపేట, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో పలుచోట్ల ఈరోజు మధ్యాహ్నం వర్షం కురిసింది. ఆ తర్వాత కాస్త తెరిపిచ్చినప్పటికీ, సాయంత్రం మళ్లీ భారీ వర్షం ప్రారంభమైంది.

# 15 సూత్రాల శాంతి ప్రణాళికను పంపిన అమెరికా
## ఇరాన్‌తో యుద్ధానికి తెరపడే సమయం..

మార్చి 25 : ఇరాన్‌తో నెల రోజులుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా కీలక ముందడుగు వేసింది. యుద్ధాన్ని నిలిపివేసి, అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు 15 సూత్రాలతో కూడిన ఒక విస్తృత ప్రణాళికను ఇరాన్‌కు పంపింది. మరోవైపు, ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఈ ప్రతిపాదనలను పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు చేరవేశారు. ఈ ప్రణాళిక ప్రకారం ఇరాన్ తన మూడు ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలను పూర్తిగా మూసివేయాలి. యురేనియం శుద్ధిని నిలిపివేసి, ఇప్పటివరకు శుద్ధి చేసిన అణు ఇంధనాన్ని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (IAEA) కు అప్పగించాలి. బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని కూడా నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరిస్తే ఇరాన్‌పై విధించిన అన్ని అణు సంబంధిత ఆంక్షలను ఎత్తివేస్తామని అమెరికా హామీ ఇచ్చింది. అంతేకాకుండా, విద్యుత్ ఉత్పత్తి కోసం బుషెహర్‌లో పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడానికి మద్దతు ఇస్తామని తెలిపింది. ఆంక్షలను తిరిగి విధించే "స్నాప్‌బ్యాక్" విధానాన్ని కూడా రద్దు చేస్తామని పేర్కొంది. ఈ అంశంపై అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం మాట్లాడుతూ "వారు ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ సమకూర్చుకోకుండా ఉండేందుకు అంగీకరించారు" అని పేర్కొన్నారు. అయితే, దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇజ్రాయెల్, కువైట్, సౌదీ అరేబియా వంటి దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోందని, ఇరు దేశాల మధ్య ఇంకా చాలా దూరం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు

ఢిల్లీ, మార్చి 25(భారత శక్తి) : హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల ఛార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# దోమడుగు అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- దోమడుగులో 79 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల, మార్చి 25 (భారత శక్తి): నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు వార్డులో హెట్రో డ్రగ్స్ పరిశ్రమ సౌజన్యంతో 79 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, రక్షిత మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపల్ అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి అని తెలిపారు. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు



సంపూర్ణ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, హెట్రో డ్రగ్స్ పరిశ్రమ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దోమడుగు కౌన్సిలర్ రాజశేఖర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ట్రంప్ బృందాన్ని కాదని.. జేడీ వాన్స్‌తో చర్చలకు ఇరాన్ మొగ్గు!

మార్చి 25 : అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తెరవెనుక జరుగుతున్న చర్చల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందం కంటే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో చర్చలు జరపడానికే ఇరాన్ ఎక్కువ ఆసక్తి చూపుతోంది. ట్రంప్ ప్రధాన సలహాదారులు, అల్లుడు అయిన జేర్డ్ కుష్నర్ తో పాటు స్టీవ్ విట్‌కాఫ్‌లను పక్కనపెట్టి వాన్స్‌తో సంప్రదింపులకు టెహ్రాన్ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. జేర్డ్ కుష్నర్ పట్ల ఇరాన్‌కు తీవ్ర అపనమ్మకం ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్‌తో కుష్నర్‌కు ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల, ఆయన చర్చల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించరని ఇరాన్ భావిస్తోంది. గతంలో ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య కుదిరిన 'అబ్రహం ఒప్పందాల'లో కుష్నర్ పోషించిన కీలక పాత్రను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు, రిపబ్లికన్ సెనేటర్ అయిన జేడీ వాన్స్.. అమెరికా అనవసరమైన విదేశీ యుద్ధాల్లో జోక్యం చేసుకోకూడదనే వైఖరిని బలంగా వినిపిస్తున్నారు. ఆయనతో చర్చలు జరిపితే, మధ్యప్రాచ్యంలో శాంతికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని, తమ ప్రయోజనాలను కాపాడుకోవచ్చని ఇరాన్ భావిస్తున్నట్లు సమాచారం. ట్రంప్ బృందంలోని కఠిన వైఖరి గల వారిని తప్పించి, సానుకూల దృక్పథం ఉన్న నేతలతో మాట్లాడటం ద్వారా అమెరికాఇజ్రాయెల్ బంధాన్ని బలహీనపరచాలనేది కూడా ఇరాన్ ఎత్తుగడ కావచ్చని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# చిట్కుల్ లో శాస్త్రోక్తంగా శ్రీ సీత రామ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- భక్తులకు దర్శనం ఇచ్చిన సీతా రాములు
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు కాలనీ వాసులు భక్తులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు నీలం మధు ముదిరాజ్ దంపతులు

సంగారెడ్డి జిల్లా (భారత శక్తి) మార్చి 25: ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో నిర్మించిన శ్రీ హనుమ సమేత సీతా రామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నులపండువగా ముగిసింది. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా, బుధవారం తెల్లవారుజాము



నుండే వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9:43 గంటలకు మృగశిర నక్షత్ర యుక్త వృషభ లగ్న సుముహూర్తాన స్వామి వారి యంత్ర స్థాపన, బింబ స్థాపన, శిఖర స్థాపన ఘట్టాలను అత్యంత వైభవంగా పూర్తి చేశారు. అనంతరం మూర్తులకు ప్రాణ ప్రతిష్ఠ గావించి, నేత్రోన్మీలనము నిర్వహించారు. ఆలయ నిర్మాణంతో పాటు కాలనీలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు నీలం మధు ముదిరాజ్ తీసుకున్న ఈ చొరవను కాలనీ వాసులు కొనియాడుతున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మూర్తులకు ప్రత్యేక కళా కుంభాభిషేకము, శ్రీ సీతారామ స్వామి దేవతా అర్చనలు నిర్వహించారు. మహానివేదన, మంగళ నీరాజనాల అనంతరం భక్తులకు రక్షాధారణ, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామనామ స్మరణతో చిట్కుల్ పుర వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, భక్తులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

ఢిల్లీ, మార్చి 25(భారత శక్తి) : ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు. అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

# సీతారాముల కల్యాణానికి సర్కారీ పట్టు వస్త్రాలు



* **ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చొరవతో మూడు గ్రామాలకు కానుకలు**

ఇబ్రహీంపట్నం, మార్చి 25 (భారత శక్తి) : నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు అందనున్నాయి. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చొరవతో ఈ ఏడాది తొర్రూర్, గండిచెరువు, కవాడిపల్లి గ్రామాల్లో జరిగే కల్యాణ వేడుకలకు అధికారికంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

**వైభవంగా ఏర్పాట్లు.**

ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలను మరింత వైభవంగా జరిపేందుకు ప్రభుత్వం నుండి సహకారం తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాలకు అవసరమైన పట్టు వస్త్రాలను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడటంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



* **భక్తులకు ఇబ్బందులు కలగకుండా..**

కల్యాణ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో, ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోరుతూ ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఈసారి మూడు గ్రామాల్లో వేడుకలు మరింత ప్రత్యేకంగా జరగనున్నాయి.



## వధూవరులను ఆశీర్వదించిన
# పారిజాత నర్సింహారెడ్డి

బాలాపూర్: మార్చి 25 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ఎస్పీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మమత, సాయి దుర్గ ప్రసాద్‌ల వివాహ వేడుకకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నూతన వధూవరులను కలిసి శుభాకాంక్షలు తెలిపి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ఇరు కుటుంబాల బంధుమిత్రులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం

* **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ.**
* **మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్.**

జవహర్ నగర్, మార్చి 25 (భారత్ శక్తి): ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం లభిస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని దొండ తోట కాలనీ వాస్తవ్యులైన గొడుగు సంధ్య యాకయ్య దంపతులకు ఇటీవలే ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం చేపట్టగా సంధ్య యాకయ్యలు ఇటీవల ఇల్లు నిర్మించుకొని నూతన గృహప్రవేశానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గృహప్రవేశానికి జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి జవహర్ నగర్ లో పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఎంపిక ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజలకు నిలయమైన జవహర్ నగర్ లో ప్రభుత్వ పథకాలను సద్వినియం చేసుకోవడం ముదాభావమన్నారు. తెలంగాణలో ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం జరుగుతుందని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షునితో రిబ్బన్ కట్ చేసే గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బల్లి శ్రీనివాస్ గుప్తా, మాట్ల వినయ్, అరికల అనిల్ ముదిరాజ్, అశోక్ గుప్తా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## కొద్దిపాటి వర్షానికే
# పడిపోయిన చెట్టు...కారు ధ్వంసం

ఎల్బీనగర్, మార్చి 25 (భారత శక్తి): కొద్దిసేపు కురిసిన భారీ వర్షానికి పెద్ద చెట్టు కూలి కారుపై పడింది. కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని సింధూర హోటల్ పక్కన సందులో వర్షం కారణంగా ఓ పెద్ద చెట్టు కూలింది. ఇంటి సమీపంలో పార్క్ చేసి ఉన్న కారుపై చెట్టు కూలి పడడంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఘటన సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో పాటు రోడ్డుపై కూడా ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న డీఆర్‌ఎఫ్ అధికారులు చెట్టును తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. భారీ వర్షం కారణంగా పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ కూడా కొంతసేపు అంతరాయం కలిగింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు.పాత చెట్లు, బలహీనంగా ఉన్న కొమ్మలను ముందుగానే తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. వర్షాకాలంలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జర్నలిస్టుల 'మహా' గర్జన
# పాలకుల వివక్షపై కదంతొక్కిన కలం యోధులు!





హైదరాబాద్, మార్చ్ 25 (భారత శక్తి):తమ సమస్యల పరిష్కారం కోసం, పాలకుల వివక్షా పూరిత వైఖరిపై రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు సమరశంఖం పూరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కమీషనరేట్) జర్నలిస్టుల నిరసనలతో హోరెత్తింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పిలుపు మేరకు నిర్వహించిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమం విజయవంతమైంది. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పాత్రికేయులు మాసబ్ ట్యాంక్ ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించి, కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు.

**హామీలు గాలికి.. సంక్షేమం శూన్యం!**

ధర్నానుద్దేశించి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రధానంగా జర్నలిస్టుల సంక్షేమాన్ని బడ్జెట్ లో పూర్తిగా విస్మరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీలోనూ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి తప్పించుకోవాలని చూస్తోందని దుయ్యబట్టారు.

**చిన్న పత్రికల గొంతు నొక్కుతున్న సర్కార్:**

* చిన్న, మధ్య తరహా పత్రికల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న శీతకన్ను వైఖరిని సోమయ్య తీవ్రంగా ఖండించారు.
* బకాయిల పెండింగ్: గత రెండేళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకుండా చిన్న పత్రికల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారని ధ్వజమెత్తారు.
* ఎంపానల్మెంట్ కష్టాలు: ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ గుర్తింపు ఉన్నా కొత్త పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని ఆరోపించారు.
* పెన్షన్ లేదు: పొరుగు రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ ఇస్తుంటే, ఇక్కడ ఆ ఊసే లేదని వాపోయారు.



**రాజకీయ పక్షాల మద్దతు:**

ఈ పోరాటానికి జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులను విస్మరించిన ఏ ప్రభుత్వానికి భవిష్యత్తు ఉండదని ఆయన హెచ్చరించారు. అనంతరం జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐఅండ్ పీఆర్ డైరెక్టర్ కిషోర్ బాబుకు అందజేశారు.

**భవిష్యత్ కార్యాచరణ:**

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 'జర్నలిస్టుల చైతన్య యాత్ర' పేరుతో ప్రజల్లోకి వెళ్తామని ఫెడరేషన్ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్ సహా వివిధ జిల్లాల బాధ్యులు, మహిళా ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటాయించిన మెడికల్ కాలేజీని అక్కడే కొనసాగించాలి

* **ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

ఎల్బీనగర్, మార్చి 25 (భారత శక్తి): అసెంబ్లీలో ఈరోజు జరిగిన క్వశ్చన్ అవర్ (ప్రశ్నోత్తరాల సమయం) సందర్భంగా వైద్య మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన చర్చలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాకు గతంలో మంజూరైన మెడికల్ కాలేజీ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆమె మాట్లాడుతూ,గతంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేకంగా ఒక మెడికల్ కాలేజీని మంజూరు చేయడం జరిగిందని, దానిని మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు వద్ద ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆమె గుర్తు చేశారు.



ప్రస్తుతం ఈ మెడికల్ కాలేజీని ఎల్బీనగర్‌కు తరలిస్తున్నారనే వార్తలు వింటున్నామని, ఇది ఆ ప్రాంత ప్రజలకు అన్యాయం చేయడమేనని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.శ్రీశైలం హైవేపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, అక్కడ ప్రమాదం జరిగినప్పుడు చికిత్స కోసం హైదరాబాద్ వచ్చే వరకు మధ్యలో ఎక్కడా సరైన వైద్య వసతులు లేవని, పేషంట్ హైదరాబాద్ చేరుకునేలోపు మార్గమధ్యలో చనిపోయే అవకాశం ఉందని ఆమె అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు.కాబట్టి మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం వంటి ప్రాంతాల్లో మెడికల్ కాలేజీ అందుబాటులోకి వస్తే 400 పడకల ఆసుపత్రి కూడా వస్తుందని, తద్వారా ఆ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వివరించారు. ఇప్పటికే కందుకూరులో స్థలం కూడా కేటాయించి, గతంలోనే మాజీ మంత్రి హరీష్ రావు ఫౌండేషన్ వేయడం జరిగిందని గుర్తు చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ కాలేజీని ఎల్బీనగర్‌కు మార్చకుండా, కందుకూరులోనే కొనసాగించాలని ప్రస్తుత వైద్యారోగ్య శాఖ మంత్రికి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను గమనించాలని ఆమె కోరారు.

# పురపాలికలో సమస్యల పరిష్కారానికి కృషి

* **పుర కమిషనర్ కే రమేష్**

సిద్దిపేట , మార్చి25 (భారత శక్తి): పురపాలికలో పాలకవర్గం సహకారంతో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు వార్డుల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యంపై మరింత దృష్టి పెట్టినట్లు దుబ్బాక పుర కమిషనర్ కే.రమేష్ కుమార్ తెలిపారు. దుబ్బాక పురపాలికకు నగరాభివృద్ధి పేరుతో మంజూరైన నిధులకు సంబంధించి,18వ వార్డులో చేపట్టిన మురుగు కాల్వల నిర్మాణ పనులను బుధవారం వార్డ్ కౌన్సిలర్ శ్రీరాం సరస్వతితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలికలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు.త్వరలోనే ప్రతి వార్డులో తడి, పొడి, హానికర చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.స్వచ్ఛ దుబ్బాక సాధనకు ప్రజలందరూ తమతో సహకరించాలన్నారు.వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ఉండే విధంగా చేపట్టాలని గుత్తేదారును కోరారు.ఈనెల 31వ తేదీలోగా పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ప్రజలందరూ సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రస్తుత వేసవి కాలంలో వార్డుల్లో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణం పూర్తయిన అనంతరము రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీరాం నరేందర్, ఆకుల భరత్, వర్క్ ఇన్స్పెక్టర్ దిలీప్ తదితరులు ఉన్నారు.





Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.